# ప్రజా తపన
prajathapana.com
News that matters




పవిత్రత లోపించిన ఆలోచన, అపవిత్రమైన కార్యంతో సమానమైనదే. కోరికల్ని అదుపు చేస్తే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవచ్చు. లైంగిక శక్తిని ఆధ్యాత్మిక మార్గంలోకి మరల్చండి.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 45 గురువారం 30 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# కర్ణాటక శాసనసభకు మోగిన ఎన్నికల నగారా!

## మే10న ఎన్నికలు...13న కౌంటింగ్



**బెంగళూరు:**

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. మే 10 వ తేదీన ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించింది. మే 13వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ మేరకు ఏప్రిల్ 13న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నామినేషన్ల ఆఖరు తేదీ ఏప్రిల్ 20గా నిర్ణయించిన ఈసీ..21వ తేదీన వాటిని పరిశీలిస్తామని స్పష్టం చేసింది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 24 ఆఖరి గడువుగా ప్రకటించింది. ఏప్రిల్ 1వ తేదీనాటికి 18 ఏళ్లు పూర్తైన ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు అర్హులేనని వెల్లడించింది. 80 ఏళ్లు దాటిన వారెవరైనా...ఇంటి నుంచే ఓటువేసే అవకాశం కల్పించింది. వోట్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించడం ఇదే తొలిసారి. గిరిజన ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. దివ్యాంగులకూ ఇదే అవకాశం కల్పించనున్నట్టు చెప్పారు. 2018-19 నుంచి ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోందని తెలిపింది. 9.17 లక్షల మంది ఓటర్లు పెరిగినట్టు స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే..ఏడాదిన్నర

(మిగతా 3లో)



# బియ్యపు గింజలపై రామనామం

**గద్వాల**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ పట్టణంలోని తుపత్రాల ఆచార్య చక్రవర్తి స్వామి శ్రీరామనవమి సందర్భంగా బియ్యపు గింజ పై శ్రీరామ నామాన్ని గత పది సంవత్సరాలుగా నిరంతరంగా అత్యంత భక్తిశ్రద్ధలతో రాస్తున్నారు. ప్రతిరోజు శ్రీరామ నామాన్ని 41 రోజులుగా రాస్తూ 35వేల బియ్యపు గింజల పై వ్రాసి తన భక్తిని చాటుకున్నారు. శ్రీరామ రక్ష సర్వ జగద్రక్ష అన్నట్లు, నిరంతరం ధర్మసేవ కార్యక్రమంలో ధర్మమంటే శ్రీ రాముడే అందరికీ ఆదర్శం. భగవన్నామ స్మరణలో ప్రతి ఒక్కరూ దైనందిన కార్యక్రమంలో భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో శ్రీ రామ నామాన్ని ఉచ్చరిస్తూ, తమ జీవితాన్ని గడపాలని శ్రీ ఆచార్య చక్రవర్తి తెలిపారు.రామా అనే అక్షరం లోనే అగ్నితత్వము, సూర్య తత్వము ,చంద్ర తత్వము ఉంటాయి. కాబట్టి శ్రీరామ నామము చాలా అద్భుతమైనది. రామా అంటే మోక్షం కలుగుతుంది . రామ అంటే ధైర్యం వస్తుంది. శ్రీరామ్ అంటే సర్వపాపాలు నశిస్తాయి. మోక్షం మార్గానికి భగవన్నామ స్మరణ ని మించినది లేదు. కాబట్టి శ్రీరామ నామాన్ని మనం జపిస్తుంటే అంతా మంచిదే జరుగుతుందని, అలాగే సకుటుంబ సపరివారంగా అందరు కూడా ఈ శ్రీరామ నామాన్ని జపించాలని సందర్భంగా అయన అన్నారు.

# దర్యాప్తు అధికారి రాంసింగ్ కొనసాగడంపై సుప్రీం అభ్యంతరం

**న్యూఢిల్లీ :**



మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో సుప్రీంకోర్టు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. దర్యాప్తు అధికారి రాంసింగ్ ను కొనసాగించడంపై న్యాయమూర్తి ఎం ఆర్ షా అభ్యంతరం వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో దర్యాప్తు వేగంగా సాగటం లేదని.. దర్యాప్తు అధికారులను మార్చాలని కోరుతూ వివేకా హత్య కేసులో ఏ5 నిందితుడిగా ఉన్న శివశంకర్ రెడ్డి భార్య తులశమ్మ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ

(మిగతా 3లో)

# మహాకూటమికి సావర్కర్ గండం..



**ముంబై :**

రాహుల్‌గాంధీ అనర్హత ఎపిసోడ్ దేశంలోనే కాదు.. మహారాష్ట్రలో కూడా పెను రాజకీయ దుమారానికి దారితీస్తోంది. నేషనల్ పాలిటిక్స్‌లో శత్రువుల్ని సైతం మిత్రులుగా మార్చుకుంటున్న రాహుల్.. మరాఠీ గడ్డపై మాత్రం మిత్రుడ్ని శత్రువుగా మార్చుకుంటున్నారు. మహామహా కూటములే కూలిపోయే ప్రమాదంలో పడ్డాయ్.

(మిగతా 3లో)



## నేపాల్ కు అమృత్ పాల్..?

**ఛండీఘడ్:**

ఖలిస్థాన్ వేర్పాటు వాది అమృత్ పాల్ సింగ్ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. ఆచూకీ కోసం దాదాపు 8 రాష్ట్రాల పోలీసులు గాలిస్తున్నారు. పంజాబ్ నుంచి మారు వేషంలో పరారైన అమృత్ పాల్ సింగ్ తొలుత హర్యానా వెళ్లినట్టుగా సీసీటీవీ విజువల్స్ వైరల్ అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అమృత్ పాల్ పోలీసులు తనను పట్టుకుంటారనే ఆలోచనతో ఉత్తరాఖండ్‌కి మకాం మార్చినట్లు సమాచారం అందింది. తాజాగా అమృత్ పాల్ సింగ్ తలకు టర్బన్ లేకుండా ఢిల్లీ వీధుల్లో తిరుగుతూ కనిపించినట్లు సీసీటీవీ ఫుటేజీ వెలుగులోకొచ్చింది. ఆ సమయంలో అమృత్ పాల్ సింగ్ ప్రధాన అనుచరుడైన పపల్ ప్రీత్ సింగ్ కూడా అతడి వెంటే ఉన్నట్టు సీసీటీవీ ఫుటేజీ స్పష్టంచేస్తోంది. తలకు టర్బన్ లేకుండా పెరిగిన జుట్టుతో ఉన్న అమృత్ పాల్ సింగ్.. ముఖానికి మాస్క్ ధరించి కనిపించాడు. అందులో ఉన్నది అసలు అమృత్ పాల్ సింగ్, అతడి అనుచరుడు పపల్ ప్రీత్

(మిగతా 3లో)

# రాహుల్ పై కాంగ్రెస్ లోనే కుట్ర

**న్యూఢిల్లీ:**




కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మరోసారి కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. రాహుల్ గాంధీపై అనర్హతా వేటు వేస్తే...ఆయన తరపున వాదించేందుకు ఆ పార్టీలోని ఏ ఒక్క న్యాయవాది కూడా ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. అంతే కాదు. రాహుల్‌పై సొంత పార్టీ నేతలే కుట్ర చేస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. రాహుల్ ఇలాంటి కేసుల్లో ఇరుక్కోవడం కొత్తేమీ కాదని, ఆయనపై 7 పరువు నష్టం దావా కేసులున్నాయని అన్నారు. వాటిపై పలు కోర్టుల్లో విచారణ జరుగుతోందని వెల్లడించారు. పార్లమెంట్ నుంచి ఆయనను తప్పించడంలో కేంద్రానికి, లోక్‌సభ సెక్రటేరియట్‌కు కానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్ట ప్రకారమే ఆయనపై అనర్హతా వేటు వేశారని అన్నారు. “కాంగ్రెస్‌లో ఎంతో మంది గొప్ప న్యాయవాదులున్నారు. వాళ్లకు అధిష్ఠానం రాజ్యసభ ఎంపీలుగా అవకాశమిచ్చింది. ఇప్పుడు రాహుల్‌పై అనర్హతా వేటు పడితే..వారిలో ఏ ఒక్కరు కూడా ముందుకొచ్చి ఆయనను కాపాడే ప్రయత్నం చేయడం లేదు. ఇది రాహుల్‌పై జరుగుతున్న కుట్ర అనుకోవాలా..? పవన్ ఖేరాకు ఇలాంటి పరిస్థితే ఎదురైతే ఆ లాయర్‌లు అందరూ ముందుకొచ్చి ఆయనను కాపాడారు. మరి రాహుల్ గాంధీ విషయంలో వాళ్లెందుకు మౌనంగా ఉన్నారు..? రాహుల్‌పై కుట్ర చేస్తున్న వారెవరో..? ఇదో అంతుచిక్కని ప్రశ్న”సుప్రీంకోర్టుకి క్షమాపణ లేఖ రాసిన తరవాత కూడా రాహుల్ వైఖరిలో ఎలాంటి మార్పూ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు అనురాగ్ ఠాకూర్. ఖీూ లాంటి సంస్థలపై మళ్లీ అదే విధంగా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రెస్‌మీట్‌లో ఓ జర్నలిస్ట్‌తో పరుషంగా మాట్లాడడంపైనా మండి పడ్డారు. తమ దగ్గర దాపరికాలు ఏమీ లేవని...దర్యాప్తు సంస్థలు చాలా స్ట్రాంగ్‌గా ఉన్నాయని స్పష్టం చేశారు. వాటి పనితీరుపైపై అనుమానాలు అక్కర్లేదని తేల్చి చెప్పారు. రాహుల్ గాంధీ చేసిన సావర్కర్ వ్యాఖ్యలపైనా అనురాగ్ ఠాకూర్ ఫైర్ అయ్యారు. రాహుల్ కల్లో కూడా సావర్కర్ అవ్వలేరని సెటైర్ వేశారు. దేశంపై ప్రేమ, గౌరవం ఉన్న వాళ్లే ఆ స్థాయికి చేరుకుంటారని విమర్శించారు. బ్రిటీష్ వాళ్లకు సావర్కర్ సారీ చెప్పారంటూ గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపైనా బీజేపీ తీవ్రంగా మండి పడింది. ఇప్పుడు మరోసారి రాహుల్ సావర్కర్ ప్రస్తావన తీసుకురావడంపై విమర్శలు చేస్తోంది. భరత మాత సంకెళ్లు తెంచేందుకు రాహుల్ బ్రిటన్‌కు వెళ్లారంటూ ఎద్దేవా చేశారు

(మిగతా 3లో)

ప్రజా తపన
prajathapana.com
News that matters

# శ్రీరామనవమి - వైశిష్ట్యం



**ప్రజాతపన ,**

భారతదేశంలో రామ మందిరం లేని ఊరు దాదాపు ఎక్కడా కనిపించదు. భారతీయ జీవన విధానంలో రామ నామం, రాముడి వ్యక్తిత్వం అంతలాగా అనాది నుంచి ప్రతిబింబిస్తూనే ఉంది. ఆదర్శ పురుషుడు అనగానే మొట్టమొదటిగా గుర్తొచ్చే ఏకైక రూపం శ్రీరాముడు.

ఆధ్యాత్మిక ప్రపంచంలో భారతీయ జీవన విధానంలో ప్రజల దినచర్య కౌసల్యా సుప్రజా రామా అంటూ సుప్రభాతంతో ప్రారంభమై రామ స్కంధం హనూమంతంఅనే శ్లోక పఠనంతో నిద్రలోకి జారుకోవడంతో రోజు ముగుస్తుంది. శ్రీరాముడు, శ్రీమద్రామాయణము, సీతారాములు ఆదర్శవంతమైన జీవన విధానము ఎప్పటికప్పుడు నిత్య నూతనము. అందుకనే విశ్వనాథ వారు రామాయణ కల్ప వృక్షం రాస్తూ మరల ఇదేల రామాయణమన్న అని అంటారు.

భారతదేశంలోనూ అందులో తెలుగు నాట ఆదర్శ దంపతుల్లో మొట్టమొదటిగా చెప్పుకునే వాళ్ళు సీతారాములు. చైత్ర శుద్ధ నవమి శ్రీరామ జన్మతిథి. ఆంధ్రదేశంలో ఆనాడే సీతారాముల కళ్యాణం జరిపించడం జగద్విఖ్యాతం. శ్రీమద్రామాయణం గురించి శ్రీ రాముల వారి గురించి ఎంత చెప్పుకున్నా ఇంకా ఇంకా వినాలనిపిస్తూనే ఉంటుంది. రామో విగ్రహాన్ ధర్మః రాముడు ధర్మానికి ప్రతిరూపం. శ్రీరామనవమి విశిష్టతను గురించి ఇక్కడ కొంత ప్రస్తావిస్తున్నాను.

## శ్రీరామ నవమి:

ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమి మనకు శ్రీరామనవమి. వసంతనవరాత్రులకు ఇది ఆఖరు రోజు.

శ్రీమహా విష్ణువు ఎత్తిన పదిఅవతారాల్లోనూ శ్రీ రామావతారం ఏడోది. శ్రీరాముడు కోసల దేశాధీశ్వరుడైన దశరథునకు కౌసల్య గర్భమున చైత్ర శుద్ధనవమినాడు పునర్వసు నాలుగో పాదాన కర్కాటక లగ్నంలో మధ్యాహ్నం పుట్టాడు.అందుచేత ప్రతి సంవత్సరం చైత్రశుద్ధనవమి శ్రీరామజయంతి రోజైంది.

మన పంచాంగ కర్తలు పది అవతారాల జయంతి తిథులను ఈ
విధంగా పేర్కొంటున్నారు.

## దశావతార జయంతులు

1. మత్స్య. - : చైత్ర బహుళ పంచమి
2: కూర్మ:. - :వైశాఖ శుద్ధపూర్ణిమ
3. వరాహ - :చైత్ర బహుళ త్రయోదశి
4. నారసింహ - :వైశాఖ శుద్ధ ద్వాదశి
5. వామన. - :భాద్రపద శుద్ధచతుర్దశి
6. పరశురామ - వైశాఖ శుద్ధ ద్వాదశి
7. రామ. - చైత్ర శుద్ధనవమి
8. కృష్ణ. - శ్రావణ బహుళ అష్టమి
9. బుద్ధ - వైశాఖ శుద్ధపౌర్ణమి
10. కల్కి- భాద్రపద శుద్ధవిదియ

ఈ పట్టిక వలన పది అవతారాల్లోనూ మూడు అవతారాల
ప్రాదుర్భావం చైత్ర మాసంలోనే అని తేలుతూ ఉంది. పది అవతారాల్లో మూడింటి ప్రాదుర్భావానికి నోచుకున్న చైత్రమాస మాహాత్మ్యం ప్రశస్తమైంది కదా!

మత్స్య, వరాహ, శ్రీరామ అవతారాల జయంతులు ఇలా చైత్రమాసంలోనే. ఇందులో ఇంకో విశేషం. ఏంటటే వచ్చే ఈ పది జయంతులలోను సంవత్సరాదికి తర్వాత మొదట వచ్చే జయంతి పర్వం శ్రీరామనవమే.

## శ్రీరామ జననం:

శ్రీరామచంద్రుడు లోక ప్రసిద్ధుడు.రాముడు జన్మించిన సందర్భంలోని గ్రహకూటమి వాల్మీకి రామాయణంలో వర్ణింపబడింది.

తతో యజ్ఞ సమాప్తేతు ఋతునాం షట్ సమత్యయుః
తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌః
నక్షత్రే దితిదైవత్యే స్వోచ్చ సంస్థేషు పంచసు !
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా దిందునా సహ!!
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక సమస్కృతమ్
కౌసల్యా జనయ ద్రామం సర్వ లక్షణ సంయుతమ్
(రామా: బాల: 18సర్గ 7-10శ్లో)

యజ్ఞం సమాప్తమైంది. ఆరు ఋతువులు గడిచాయి. 12వ మాసం చైత్రంలో నవమి తిథి అదితి దేవతాకమైన పునర్వసు నక్షత్రంలో స్వోచ్ఛ స్థానాలలో ఐదుగ్రహాలుండగా కర్కాటక లగ్నంలో చంద్రునితో కలిసిన బృహస్పతి ఉదయిస్తుండగా సర్వలోక నమస్కృతుడు, జగన్నాథుడు సర్వ లక్షణ సంయుతుడైన శ్రీరామచంద్రుని కౌసల్య కన్నది అని పై శ్లోకాల సారం.

ఇందులోపన్నెండవ మాసం చైత్రం అనేదానికి కొందరు ఇలా అర్థం చెపుతున్నారు. "శ్రీరాముని జననానికి పూర్వం వైశాఖంతో సంవత్సరం ఆరంభమయ్యేది. అందుచేతనే సంవత్సరంలో పన్నెండవది చైత్రమాసం. శ్రీరాముని జననం అయిన తరువాత అదే సంవత్సరారంభంగా గుర్తించబడింది.

కాని, ఆరు ఋతువులు గడిచాయి. యజ్ఞం అయిన తరువాత పన్నెండవ మాసం అవడం వలన యజ్ఞం పూర్తి అయిన తరువాత మాసాల్లో చైత్రం పన్నెండవదే గాని సంవత్సరంలో పన్నెండవది కాదు అని అర్థం చేసుకోవడం న్యాయం. కౌసల్యా గర్భధారణకు పాయస భోజనమే కారణమని సంప్రదాయవాదుల అభిప్రాయం. అలాంటి స్థితిలో 12 మాసాలు శ్రీరామచంద్రుడు కౌసల్యా గర్భంలో నివసించాడు. తొమ్మిది మాసాలే గర్భధారణ సామన్యం.ఈతడు 12 మాసాలు గర్భంలో నివసించడానికి కారణమేమిటి?

ఈ ప్రశ్నకు పండితుల సమాధానం ఇలా ఉంది. వేదమే రామాయణంగా అవతరించింది. వేదంలో సంవత్సరేణ జాయతే' అని ఉన్నందువల్ల ఆ వేదవాక్యాన్ని సత్యం చేయడానికి శ్రీరామచంద్రుడు 12 మాసాలు తల్లి గర్భంలో ఉన్నాడు. లోకంలో సహజంగా తొమ్మిది మాసాలే గర్భంలో ఉండటం తటస్థిస్తూ ఉంటే వేదంలో సంవత్సరం అని ఎందుకుంది? అనేది కూడా ప్రశ్నే కాని తండ్రి గర్భంలో 3 మాసాలు, తల్లి గర్భంలో 9 మాసాలు కలిసి సంవత్సరం అందరికీ పూర్తి అవుతుంది.

శ్రీరాముని విషయంలో పాయసం ద్వారా తల్లి గర్భంలో ప్రవేశించినందు వలన తండ్రి గర్భంలో లేనందువలన సంవత్సరకాలము తల్లి గర్భంలోనే పూర్తిచేసుకోవలసి వచ్చింది".

చైత్ర శుద్ధ నవమి పునర్వసు నక్షత్రంలో అభిజిత్ లగ్న కర్కాటకం మధ్యాహ్న సమయంలో కర్కాటకంలో చంద్ర గురువులు, కన్యలో రాహువు, తులలో శని, మకరంలో కుజుడు, మీనంలో కేతువు, శుక్రుడు, మేషంలో సూర్యుడు, వృషభంలో బుధుడు ఉండగా శ్రీరామ చంద్ర ప్రభువు ఆవిర్భవించాడు. దీన్ని వేదసాగర యోగం అంటారు. ఈ వేద సాగర యోగంలో ఉత్పన్నమయ్యేవారు పూర్వజన్మలో స్వయంగా పూర్ణబ్రహ్మలు. స్వయం కర్తలు, స్వప్రకాశులు, నిరంజనులు, నిర్గుణులు, నిర్వికల్పులు, నిర్మోహులు, సచ్చిదాత్ములు అవుతారని ఆధ్యాత్మ రామాయణం చెబుతోంది...

భగవంతుడే స్వయంగా "ఋతూనాం కుసుమాకరః" ఋతువులలో నేను కుసుమాకరాన్ని (వసంతాన్ని) అని చెప్పాడు. అందులోనూ ప్రథమ మాసం యొక్క దేవపక్షం అతి పునీతమైంది. అందులోనూ తన కిష్టమైన అభిజిత్ ముహూర్తంలో- పునర్వసు (పునఃవసుః తిరిగి జన్మించడం). నక్షత్రంలో పుట్టాడు.

గర్భనవరాత్రులు.

ఈ పండుగ తొమ్మిది రోజులు చేస్తారు. ఆ తొమ్మిది రోజులలో ఉగాదిపాడ్యమి మొదటిరోజు. ఈ తొలిరోజున ప్రారంభించి శ్రీరామ నవమి వరకు రామాయణ పారాయణ మొదలయిన పనులు చేస్తారు. ఈ తొమ్మిది రోజులను గర్భనవరాత్రాలు అంటారు. ఈ తొమ్మిది రోజుల్లో వసంత పూజలు చేసేవారు వాటిని వసంత నవరాత్రులు అంటారు.

అవీ ఇవీ నవరాత్రులే. అవీ ఇవీ, ఈనవమితో సమాప్తమవుతాయి. అయినా ఆపూజావిధానం వేరు. ఈపూజావిధానం వేరు. శ్రీరాముడు పుట్టిన రోజైన నవమి. అంతకు ముందు వారం రోజులు అంటే రాముడు గర్భంలో ఉన్న చివరి తొమ్మిది రోజులు చేసే విధులు, పూజాదికాలు గర్భనవరాత్రులను ఆరాధనీయంగా, ఆచరణీయంగా చేస్తున్నాయి. గర్భనవరాత్రులలో శ్రీరాముని గురించి చేయవలసిన పూజాదికాలు వ్రత . కల్ప గ్రంథాలలో కొంతవరకు విపులముగా ఉన్నాయి.

## రామలీలలు

చైత్రశుక్ల పాడ్యమి మొదలు నవమి వరకు రామ మందిరాల్లో, రామాలయాల్లో రామాయణ కాలక్షేపం జరుగుతుంది. కొన్నిచోట్ల రామలీల అనే అభినయం చేస్తారనీ, కాని కృష్ణలీలలకువలె రామలీలలకు శాస్త్రాధారం ఏమీ లేదనీ వ్రతోత్సవ చంద్రికా కారుడు వ్రాస్తున్నాడు.

## మూన్నాళ్ల పండుగ

అగస్త్య సంహితలో ఇది మూడు రోజుల పండుగగా చెప్పబడింది. అష్టమిని గురుపూజ, నవమిని ప్రతిమాకల్పన దశమిని ప్రతిమాదానం నవమినాడు ఉపవాసం. రాత్రి పురాణ శ్రవణాదులచే జాగరణం మరునాడు ప్రతిమాదానం, సంతర్పణ. ఈ విధంగా ఒక్కొక్కరు పన్నెండేళ్లు చేయాలి. ఈ విధంగా వ్రతా చరణం ఇప్పుడు అమల్లోలేదు.

శ్రీరామ పూజకు పునర్వసు నక్షత్రంతో కూడిన చైత్రశుద్ధ నవమిచాలా పుణ్యవంతమైన కాలం. అష్టమితో కలసిన నవమిని రామపూజకు విష్ణు భక్తులు ఎప్పుడు చేకొన కూడదని అగస్త్య సంహిత చెబుతోంది. అందుచేతనే మిగులు నవమినాడు వైష్ణవులు శ్రీరామ జయంతి జరుపుతారు.

శ్రీరామ నవమి నాటి కార్యకలాపాలు మధ్యాహ్నం పన్నెండు. గంటలకు చేయాలని వ్రత గ్రంథాలు చెబుతున్నాయి. శ్రీరామ నవరాత్రులు తొమ్మిది రోజుల్లోనూ శ్రీరామనవమి ఆఖరు రోజు, అతి ముఖ్యమైన రోజు, ఉపవాసాది నిష్ఠలు వహింపనివారు కూడా ఆనాడు స్నానం చేసి మంచి బట్టలు కట్టుకుంటారు.

## మహారాష్ట్ర ప్రాంతాల్లో

మహారాష్ట్రులు ఈ పర్వాన్ని జరిపే తీరు తెలుసుకోవలసి ఆనాడు ఉదయం తొమ్మిది మొదలు పన్నెండు గంటలవరకు దేవాలయాల్లో శ్రీరాముని పుట్టుక వరకుగల రామాయణ కథ అంతా కీర్తనల రూపంగా పాడుతారు.

సరిగ్గా పన్నెండుగంటలు కావడంతోటే అంటే అలనాడు అవతారమూర్తి శ్రీరాముడు పుట్టిన వేళకావడంతోటే బుక్కా పొడిచల్లుతారు. కొత్తగా పుట్టిన బిడ్డను ఉద్దేశించి జోలపాటలు పాడతారు. హరిదాసు అక్కడ చేరిన వారిని అందరినీ ఆశీర్వదిస్తాడు. పంచదారతో శొంఠిపొడిని కలిపి ప్రసాదంగా పంచి పెడతారు. అప్పుడు ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోతారు. 'శ్రీఖండపూరి' మహారాష్ట్రుల ఆనాటి ప్రధాన భక్ష్యము.

## ఇతర ప్రాంతాలలో

భరత ఖండంలోని ఇతర ప్రాంతాల్లో శ్రీరామనవమి పూజా విధానం ఇందుకు కొంచెం భిన్నంగా ఉంటుంది. నాటి మధ్నాహ్నం శ్రీరామ ప్రతిమను స్థాపించి షోడశోపచారపూజలు చేస్తారు. దశానన విధార్థమూ, ధర్మసంస్థాపనార్థం అవతారమెత్తిన శ్రీరాముని జననీ జనకులైన కౌసల్యాదశరథులకు రామునితో పాటు ఈనాడు షోడశోపచారపూజలు చేస్తారు. పత్ర పుష్పాదులతో పూతమైన జలంతో నిండిన శంఖంతో శ్రీ రామచంద్రమూర్తికి నేడు అర్ఘ్యం ఈయడం కొన్ని ప్రాంతాల్లో ఆచారంగా ఉంది. నవమినాటి రాత్రి జాగరణం చేస్తూ ప్రతి జామున రామపూజ సాగిస్తూ మరునాడు రామనవమి వ్రతాంగ హోమం చేసి ఉద్వాసన చేయడం కొన్ని చోట్ల ఉంది.

## జానకీ జయంతి

ఆంధ్రదేశంలో మాత్రం శ్రీరామనవమికి సీతారామకళ్యాణంచేయడం ఆచారంగా ఉంటూ ఉంది. ఈ ఆచారం ఇతర ప్రాంతాల్లో అంతగా ఉన్నట్లు కనిపించదు. పుట్టినరోజు పండుగనాడు కల్యాణం చేయడానికి కారణం ఏమీ కనిపించదు.

రామ సంబంధమైన పండుగలు ఏడాదిలో శ్రీరామ నవమికాక మరి రెండు ఉన్నాయి.

ఒకటి: రామలక్ష్మణ ద్వాదశి. ఇది జ్యేష్ఠ శుద్ధ ద్వాదశినాడు. రెండు: జానకీ జయంతి. ఇది ఫాల్గుణ శుద్ధ అష్టమి.

జనకమహారాజు యజ్ఞశాలకై భూమిని దున్నుతూ ఉండగా నాగటి. చాలులో తగిలిన బంగారు పెట్టెలో ఈనాడు సీత దొరికింది. అందుచేత ఈనాడు సీతాజయంతి దినమైంది. రామసంబంధపు పర్వదినాలైనా ఈ రెండురోజులు కూడా రామకళ్యాణానికి అనువైన తిథులని అనుకోవడానికి వీలులేదు.

## తలంబ్రాలు

శ్రీరామనవమినాడు దేవాలయంలో జరిగే సీతారాముల కళ్యాణానికి వెళ్లి తలంబ్రాల బియ్యం పుణ్యవస్తువుగా పుచ్చుకొని తల మీద వేసుకోవడం తెలుగు వారికి సనాతనాచారంగా ఉంది.

గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలు ప్రతీ ఏటా భద్రాచలం, ఒంటిమిట్ట శ్రీరామనవమి కళ్యాణోత్సవాలకు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను వినియోగిస్తుంటారు. శ్రీ మహా స్వామివారు తరచుగా ఒక మాట చెపుతుండేవారు. ఎప్పుడైనా ఏదైనా కార్యం చేస్తే శ్రీ రామ నామంతో చెయ్యండి అంటుండేవారు. కళ్యాణ కార్యక్రమంలో వాడేటటువంటి అక్షతలు తలంబ్రాలు వాటికి ధాన్యం రామనామంతో ఒలవడమనే ప్రక్రియని ప్రారంభం చేసినవారు చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామివారే. ఉత్తర హిందూస్థానంలో మొట్టమొదట మొదలుబెట్టారు ఆయన. ఆయన మొదలు బెట్టిందే ఇవాళ అనేకచోట్ల ఆ కార్యక్రమం అలా జరుగుతోంది. ఎందుకంటే భగవన్నామం పలుకుతూ తీసింది ఏది ఉన్నదో అది పరమ శక్తివంతం. అది మళ్ళీ భగవంతుడి పాదాల మీద పడుతుంది. మళ్ళీ తిరిగి అదే అక్షతగా మన తల మీదకి వస్తుంది. అది నామంతో బాగా పట్టుకొని ఉంటుంది కాబట్టి అది కార్యక్రమ సాఫల్యానికి, భక్తులు యొక్క ఉద్ధరణకి కూడా కారణమవుతుంది. అందుకని ఆయన ధాన్యం ఒలిపించే వారు. తప్పకుండా నాలుగు గింజలైనా ఒలవండి అంటుండేవారు.

దశావతారగాథల్లో శ్రీరామావతారపు గాధ ఆంధ్రదేశంలో ఎక్కువ సంబంధపడి ఉంది. రాముని వనవాసగాధ అంతా ఆంధ్రభూమి మీదనే నడిచింది. పుష్కరానికి పైగా ఆంధ్రులకు అతిథి అయి ఇంద్రుని గంగ అయిన గోదావరి తీరంలో భద్రగిరిలో అనుజునితో, అర్థాంగి తో నివసించి ఆంధ్రభూమిని పుణ్యభూమిగా చేసిన అవతార పురుషుడు శ్రీరాముడు. మిగతా అవతారాల గాథకు ఆంధ్రదేశంతో ఇంతటి సంబంధంలేదు. కృష్ణావతారంలో ఆంధ్రులు ప్రతికూల పక్షము వారై ఉన్నారని అనుకోవచ్చు. శ్రీ కృష్ణుడు చాణూరాంధ్రనిషూదనుడని విష్ణుపురాణముచెబుతూ ఉంది. పైగా ఆనాటి ఆంధ్రులు కురుక్షేత్రయుద్ధంలో కృష్ణ వ్యతిరేకులైన కౌరవులపక్షం వహించినట్లు భారతం వలన తెలుస్తోంది.

## రాముడు ఆంధ్రుల దౌహిత్రుడు

రాముడు ఆంధ్రుల దౌహిత్రుడనీ, భరతుడు పారశీకుల దౌహిత్రుడనీ సిద్ధాంతాలు ఉన్నాయి. దశరథుడు కోసలదేశపురాజు. కౌసల్య కోసల దేశపు రాజు కూతురు. ఈ కోసల దశరథుని ఉత్తరకోసలకు భిన్నమైన దక్షిణ కోసల అయి ఉండడం కాదనరానిది. దక్షిణ కోసల మనగా పూర్వం ఆంధ్రదేశపు ఉత్తర భాగమవటం కౌసల్య ఆంధ్రుల యింటి ఆడబడుచనీ, వనవాసాన్ని రాముడు తల్లి పుట్టింటి దేశపు అడవుల్లో గడిపాడనీ ఒక వాదం ఉంది. ఈ వాదం నిలవచాలింది. అయినాకాకపోయినా వనవాస రాఘవునికి ఆతిథ్యమిచ్చిన ఆంధ్రదేశంలో అతని జన్మదినమైన శ్రీరామనవమి అతని కళ్యాణ దినంగా మారింది. ఈ మార్పునకు కారణం భద్రాచలదేవాలయం పెట్టిన ఒరవడి అని అనవచ్చు. ఆ దేవాలయపు పూజా పురస్కారాల్లో అనేకమైన కొత్త మార్పులు తెచ్చి పెట్టిన రామదాసు శ్రీ రామనవమి రామకళ్యాణ దినంగా మార్చి ఉంటాడని తోస్తుంది.

ఈనాటి వివరణలో మన పంచాంగాలలో కొన్నిటిలో భద్రాచలక్షేత్రే కళ్యాణం అని ఉంటుంది. ఈనాడు రామకళ్యాణంచేసి . నేటినుంచి ఐదు రోజులు (అంటే నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి) శ్రీరామపూజ హరికథలు మొదలైన వాటితో వేడుకగా చేయడం ఇప్పుడు ఆంధ్రదేశాన పలు ప్రాంతాలలో వాడుక అయ్యింది.

## పానకము

శ్రీరామ నవమికి మిరియపు పొడివేసిన బెల్లపు పానకం విరివిగా వాడడం ఆంధ్రుల్లో పలుప్రాంతాలవారి ఆచారం. ఈ పండుగనాటికి ఆంధ్రదేశంలో గాడ్పులు ప్రారంభమవుతాయి.అందుచేత అప్పట్లో పానకం పుచ్చుకోవడం తాప శమనంగానూ కాలోచితంగానూ ఉంటుంది.

నీలమత పురాణంలో దీనిని భద్రకాళీ నవమి అనీ, పురుషార్థ చింతామణిలో దీనిని దుర్గానవమి అని కూడా అంటారని ఉందీ. దీనిని పట్టి ఈ నవమినాడు ఆయా దేవతలను కొలిచే ఆచారంకొన్ని ప్రాంతాల్లో ఉందని ఊహింపవలసి ఉంటుంది. దేవీ పూజా సహితమైన నవరాత్రులు నేటితో ముగుస్తాయి. ఈ సందర్భంలో శ్రీచారాల నరసింహమూర్తిగారుఇలా చెప్పారు..

## సీతారాముల కళ్యాణం:

శ్రీరామనవమి రోజున ఉత్తర దేశస్థులు శ్రీరాముని జననాన్ని పురస్కరించుకొని జయంతీ ఉత్సవాన్ని జరుపుతారు. శ్రీరాముని జనన మహోత్సవం అయోధ్యలో ఎంతో వైభవంగా జరుగుతుంది. ఆంధ్రదేశంలో మనం ఇందుకు భిన్నంగా కళ్యాణోత్సవం జరుపుతున్నాం. ఈ కళ్యాణోత్సవాలు చాల పురాతన కాలంనుంచి ఆంధ్రదేశంలో జరుగుతున్నై. నవమి తిధినాడు శ్రీరాముడు జన్మించడం చేత జయంతి జరపడం సహజంగానే ఉన్నది. శ్రీరాముడు వివాహం జరిగినరోజు ఫాల్గుణ పూర్ణిమ ఉత్తర నక్షత్ర శుభముహూర్తంలో, కాని మనం చైత్రశుద్ధ నవమినాడు కళ్యాణోత్సవం జరుపుతున్నాం. జగత్పూజ్యులయిన సీతారాములు వివాహానికి వసంతశోభల కూర్చడానికి చైత్రశుద్ధ నవమి జన్మదినమునే మనవారు కూడా కళ్యాణోత్సవమునకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

జన్మదినోత్సవం జరపడం కన్నా కళ్యాణోత్సవం

ప్రజా తపన
prajathapana.com
News that matters

జరపడంలోగల విశిష్టతను ఆంధ్రులు గ్రహించినంతగా ఉత్తరాదివారు గ్రహించలేదన వచ్చును. శ్రీకృష్ణ జయంతి జరుపుతాం. శ్రీ కృష్ణ కళ్యాణానికి మనం అంతగా ప్రాశస్త్యం ఈయలేదు. శ్రీ రాముని జన్మోత్సవం కన్న కళ్యాణోత్సవమునకు మనం ప్రాధాన్యం ఇచ్చాం. శ్రీరాముని జన్మకు కారణం రావణవధ తద్వారా లోకకళ్యాణం. సీతాదేవితో కూడిన శ్రీరాముని వలననే లోకకళ్యాణం సాధింప బడడింది. కనుక సీతారాముల కళ్యాణానికే మనము ఎక్కువ విలువనిచ్చాం. శ్రీకృష్ణుడు జగద్గురువు. శ్రీరాముడు జగన్నాథుడు. జగన్నాథునకు కళ్యాణోత్సవం జరపడంలోగల విశిష్టతను, సాంప్రదాయసరళిని మనం గుర్తించాం. సీతారాముల కళ్యాణం మహా వైభవంగా భద్రాచలంలో జరిగేటట్లు మరెక్కడా జరగదు.

ఒంటిమిట్టలో జరిగే కళ్యాణానికి ప్రత్యేకత ఉంది. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ నవమి నుండి బహుళ విదియ దాకా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చతుర్దశి నాడు కళ్యాణం, పౌర్ణమి నాడు రథోత్సవం ఉంటాయి.

చంద్రుని వెలుగుల్లో స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఒంటిమిట్ట ఆలయ ప్రత్యేకత. దీని వెనుక ఒక పురాణగాథవుంది. క్షీరసాగర మథనం తరువాత మహాలక్ష్మీదేవి అమ్మవారిని నారాయణుడు తన సతీమణిగా స్వీకరించాడు. పగలు జరిగే స్వామివారి వివాహాన్ని తాను చూడలేకపోతున్నానని ఆమె సోదరుడు చంద్రుడు స్వామివారికి విన్నవించగా ఒంటిమిట్టలో వెన్నెల వెలుగుల్లో తన కల్యాణాన్ని వీక్షించవచ్చని వరమిచ్చాడు. దాని ప్రకారమే రాత్రిళ్లు ఇక్కడ స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ప్రతి యేటా శ్రీరామనవమి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు.

శ్రీమద్రామాయణంలో శ్రీరామ పట్టాభిషేక సమయంలో భరతుడి పలికిన మాటలు శ్రీరాముడు పట్టాభిషేక మహోత్సవాన్ని గురించి ఎంతో రమ్యంగా వివరిస్తున్నాయి. మధ్యాహ్న వేళ నిండు వెలుగుతో జ్యోతిర్మండలం మధ్య ప్రకాశించే ప్రభాకరునిలా శ్రీరాముడు అయోధ్యకు రాజుగా పట్టాభిషిక్తుడవటం ప్రపంచానికే ముదావహం. లోకం ఈ అవకాశం కోసం ఎదురు చూస్తున్నది. అంతే కాదు రామ రాజ్యం ఒకనాటికి పరిమిత మయింది కాదు. సార్వభౌమ, సార్వకాలికంగా సారస్వత సామ్రాజ్యాన్ని స్థాపించగల సామర్థ్యం శ్రీ రామచంద్ర ప్రభువుకు ఉంది. ఈ పరమ సత్యాన్ని భరతుడు పరమ రమణీయంగా చెప్తాడు.

యావదావర్తతే చక్రం యావతీచ వసుంధరా
తావతీ త్వమిహ లోకస్య స్వామిత్వ మనువర్తయ.

ఇది భరతుని చివరి వాక్యం. మధ్యాహ్నం నభోమండలంలో ప్రకాశించే ఆదిత్యుని కాంతి వలె భూమండలంలో శాశ్వతంగా విలసిల్లే రామ రాజ్యం ఎలా ఉంటుందో ఈ శ్లోకం చాల ధ్వన్యాత్మకంగా వివరిస్తుంది. కాలచక్రం సక్రమంగా తిరుగుతున్నంత వరకూ, ఈ కాలగతితో వసుమతి పునర్వసు వికాసంతో వర్ధిల్లుతున్నంత వరకూ అన్నగారు లోకస్వామిగా ఉండి లోక -కల్యాణం సాధించవలెనని యీ భరత వాక్యంలోని వాచ్యార్థం. కాని, యీ రసాత్మకమైన వాక్యంలోని ధ్వనిని గమనించేందుకు - మధ్యాహ్నం. చక్రం, వసుంధర, లోకం, అనువర్తయ అనే మాట -లను జాగ్రత్తగా పరిశీలించాలి.

ప్రతి సంవత్సరం శ్రీరామ నవమినాడు రామచంద్రుని - జన్మోత్సవంతోపాటు సీతాకల్యాణం, పట్టాభిషేకం వేడుకగా చేసు కోవటం రామ భక్తులకు అలవాటు ప్రతి సంవత్సరం జన్మదినం చేసుకోవటం పరవాలేదు కాని మాటి మాటికి కల్యాణం, పట్టాభి షేకం చెయ్యటం అంత సమంజసంగా లేదని కొందరు ఆక్షేపించటం కూడా చూస్తుంటాము. తెలిసి చేసినా, తెలియక చేసినా ఈ రామ నవమి ఉత్సవాలలో గొప్ప జ్యోతిర్మయ మయిన రహస్యం ఉంది. ఈ రహస్యమే భరతవాక్యంలో ఇమిడి ఉంది. సూర్యుడు మేషంలో ఉండగా చంద్రుడు కర్కాటక రాశిలో పునర్వసు నక్షత్రంలో ప్రవేశించిన శుభ ముహూర్తమే శ్రీరామ నవమి. అలాగే సూర్యుడు సింహరాశిలో ఉండగా చంద్రుడు వృషభరాశిలో అలాగే రోహిణి నక్షత్రంలో ప్రవేశించిన పుణ్యదినాన్ని జన్మాష్టమి లేక శ్రీజయంతి అంటాము. చాంద్రమానానికి ప్రచారం వచ్చిన తర్వాత నవమి అష్టమి ఈ రెండు పండుగలకు ప్రధాన తిథులయ్యాయి కాని, తాత్త్వికదృష్టితో చూస్తే సూర్యచంద్రుల పరస్పర సంబంధాన్ని పురస్కరించుకొని యీ రెండు పండుగలు ఏర్పడ్డాయి. సూర్యమండలంలోని ప్రతి గ్రహానికి ఒక రాశి ఉచ్చస్థానంగా ఉంటుంది. అలాగే మరో రాశి స్వక్షేత్రమవుతుంది. ఈ దృష్టితో చూస్తే మేషం సూర్యుడికి ఉచ్చ రాశి. సింహం స్వక్షేత్రం, వృషభం చంద్రుడికి ఉచ్చరాశి, కర్కాటకం స్వక్షే త్రం. అంటే సూర్యుడు ఉచ్చ (మేషం) లో ఉండగా చంద్రుడు స్వక్షేత్రం (కర్కాటకం) లో పునర్వసులోకి వచ్చినప్పుడు సూర్య వంశపు రాజయిన రామచంద్రునికి పర్వకాల మవుతుంది. అలాగే సూర్యుడు స్వక్షేత్రం (సింహం) లో ఉండగా చంద్రుడు ఉచ్చ (వృషభం)లో రోహిణీ నక్షత్రంలో ప్రవేశించినపుడు చంద్రవంశ ప్రభువైన శ్రీకృష్ణుని జయంతి వస్తుంది. సూర్యవంశ ప్రభువు మధ్యాహ్నం అవతరిస్తే చంద్రవంశపు స్వామి అర్ధరాత్రి ఆవిర్భవించాడు. దీనిని బట్టి రామ కృష్ణుల జ్యోతిర్మయ స్వరూపం మనకు స్పష్టంగా గోచరిస్తుంది. సంవత్సర పరిమితిలో సంభవించే సూర్యచంద్రుల యీ పరస్పర సన్నివేశాలను మహర్షులు ప్రత్యక్షంగా భావించి అనుభవించి వీటికి మహత్తరమైన రూపకల్పన చేశారు. కాల స్వరూపుడయిన పరమాత్ముడు చైత్ర (మేష మాసంలో రామస్వామిగా, శ్రావణ (సింహ) మాసంలో కృష్ణపరమాత్మగా సాక్షాత్కరిస్తాడు. ఒకే పరతత్త్వం కాలగతిని బట్టి రెండు రూపాలలో తన ఆరాధ్య స్వరూపాన్ని అవగతం చేస్తుంది. కాలచక్రంలోని యీ బిందువునే వసుంధర కలకాలం ధరిస్తుందనీ, దానికి ప్రభువుగా రామస్వామి లోకాలోకాన్ని అనువర్తిస్తూ -ఉంటాడని భరతుని వాక్యలోని అంతరార్థం. ఈ భరత వాక్యమే రామాయణ పరమార్థం.

రామరాజ్యం లాగానే రామనామం, రామాయణం, రాఘవతత్వం కూడా సార్వకాలిక, సార్వభౌమమయిన సారస్వత సామ్రాజ్యాన్ని నెలకొల్పగల సనాతన సత్యాలని పై భరత వాక్యంలోని సందేశ సారం.. కథగా చూసినా, కావ్యంగా భావించినా, నీతి సంహితగా నిర్వచించుకున్నా, యోగ శాస్త్రంగా అన్వయించుకున్నా, రామాయణం సారథ్వాత పారిజాతంగా గోచరిస్తుంది. సామాన్య జనులకు అది చక్కని కథ. రసజ్ఞులకు అది రమణీయమైన కావ్యం, నీతికోవిదులకు నీతిశాస్త్రం. యోగులకు యోగ శాస్త్రం. మంత్ర పాఠకులకు మంత్రరాజం. ఇలా ఏ -దృష్టితో చూస్తే అలా గోచరించే పలు వన్నెల భవ్య చిత్రాన్ని -ఇంద్ర ధనుస్సు లాంటి యీ ఉద్గ్రంథం ప్రపంచానికి అందిస్తూ ఉంది. శ్రీరామ రామ రామ అని మూడుసార్లు రామ నామాన్ని జపిస్తే విష్ణు సహస్ర నామాన్ని జపించినంత పుణ్యఫలం లభిస్తుందని సాక్షాత్తు మహాశివుడు పార్వతిమాతతో చెప్పాడు. రామనామ విశిష్టత అమోఘమైనది. అద్వితీయమైనది.

శ్లో॥ శ్రీ రామ రామ రామేతి రమే రామే
మనోరమే ।
సహస్ర నామతత్తుల్యం రామనామ వరాననే ॥

అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు.



**డా.రాంభట్ల వేంకటరాయ శర్మ**
**ఎమ్.ఏ. పిహెచ్.డి తెలుగు, ఎమ్.ఏ.**
**జ్యోతిషం, ఎమ్.ఎస్సి. మైక్రోబయాలజీ**
**..పద్యకవి, రచయిత, నాటకకర్త,**
**జ్యోతిశ్శాస్త్రవేత్త,**
**విశాఖపట్నం 7989110805**

# మొక్కలు పర్యావరణ పరిరక్షకులు




**ప్రజాతపన ,**

బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కొటిపి పంచాయితీ లోని ఇస్లాం పురం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం ఐదవరోజు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా ఎన్ .ఎస్. ఎస్. వాలంటీర్లు గ్రామంలోని దేవాలయం, పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అలాగే గ్రామస్థుల ఇంటింటికి మొక్కలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనాథ రెడ్డి మాట్లాడుతూ" మా విద్యార్థులు నాటిన ప్రతి మొక్కను నీళ్ళు పోసి కాపాడుకుంటే అది మనల్ని మన తర్వాతి తరాలను కాపాడుతుందని" అన్నారు. ప్రోగ్రాం అధికారి అశ్వత్థ నారాయణ " మొక్కలు పర్యావరణ పరిరక్షకులు, ఆక్సిజన్ ను అందించే ప్రాణ దాతలు, వానల్ని కురిపించే గొప్ప త్యాగమూర్తులని" కొనియాడారు. ఇందులో పాఠశాల ప్రధానోధ్యాయులు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, అధ్యాపకులు వేణు, హరీష్ రఘు రమేష్ , గ్రామస్థులు పాల్గొన్నారు.



# కర్ణాటక శాసనసభకు మోగిన ఎన్నికల నగారా!

(మొదటిపేజీ తరువాయి)

తరవాత పరిణామాలు మారిపోయాయి. బీజేపీ అధికారంలోకి వచ్చింది. కర్ణాటక అసెంబ్లీలో 224 సీట్లు ఉన్నాయి. 2.59 కోట్ల మంది మహిళా ఓటర్లు కలిపి 5.21 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 16,976 మంది శతాధిక వృద్ధులు, 4,699 మంది థర్డ్ జెండర్లు, 9.17 లక్షల మంది మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కర్ణాటక ఎన్నికల్లో 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు నాలుగోవంతు ఉన్న 51 రిజర్వ్డ్ స్థానాలు కీలక పాత్ర పోషిస్తాయి. అత్యధిక రిజర్వ్డ్ స్థానాలను గెలుచుకున్న పార్టీ సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని గత ఎన్నికలు నిరూపించాయి. 51 సీట్లలో 15 షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ), 36 షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) రిజర్వు చేయబడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్రతిసారీ, బీజేపీతో పోలిస్తే రిజర్వ్డ్ సీట్ల సంఖ్య పరంగా దాని పనితీరు మెరుగ్గా ఉంది. 2008లో యడియూరప్ప నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుచేసినప్పుడు, 51 రిజర్వ్డ్ స్థానాల్లో 29 స్థానాలను ఆ పార్టీ గెలుచుకుంది, కాంగ్రెస్ 17 కైవసం చేసుకుంది. 2013లో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ రిజర్వ్డ్ స్థానాల్లో 27 గెలుచుకుంది. బీజేపీకి కేవలం ఎనిమిది స్థానాలకు మాత్రమే పరిమితమైంది. కాగా.. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తానని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ధీమా వ్యక్తంచేశారు. మంగళవారం రాత్రి ఉత్తర కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలోని హుంగుండ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి వర్గానికి సామాజిక న్యాయం అందించడానికి తాను చిత్తశుద్ధితో పనిచేశానని, ఫలితంగా వార్షిక తలసరి ఆదాయం రూ.1 లక్షకు పెరిగిందని తెలిపారు. 12వ శతాబ్దపు సంఘ సంస్కర్త, లింగాయత్ శాఖ స్థాపకుడు బసవేశ్వరుడు సూచించిన 'పనే దైవం', సామాజిక సమానత్వం అనే మార్గంలో తాను నడుస్తున్నానని సీఎం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల తొలి జాబితా విడుదల చేసింది. ఇందులో కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, కేంద్ర మాజీ మంత్రి కేహెచ్ మునియప్ప సహా 124 మంది అభ్యర్థులను శనివారం ప్రకటించింది. శివకుమార్ మూడుసార్లు గెలిచిన కనక్‌పురా నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేయనుండగా, సిద్ధరామయ్య ప్రస్తుతం ఆయన కుమారుడు యతీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్న మైసూరులోని వరుణ నుంచి బరిలోకి దిగనున్నారు. కోలారు నుంచి ఏడుసార్లు ఎంపీగా గెలిచిన మునియప్ప తన మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టాలని చూస్తున్నారు. రిజర్వ్డ్ నియోజకవర్గమైన దేవనహల్లి నుంచి ఆయన బరిలోకి దిగనున్నారు. మునియప్ప విషయంలో, గత ఏడాది జైపూర్‌లో జరిగిన ప్లీనరీ సెషన్‌లో ఆమోదించిన 'ఒక కుటుంబం-ఒకే-టికెట్' నిబంధనను కాంగ్రెస్ పట్టించుకోలేదు. దీంతో కోలార్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న ఆయన కుమార్తె రూపకళ మళ్లీ అదే స్థానం నుంచి పోటీ చేయనున్నారు. మరోవైపు.. కర్ణాటక ఎన్నికల సందర్భంగా లెక్కల్లో చూపని నగదు, ఉచిత వస్తువుల పంపిణీని అడ్డుకునేందుకు ఆదాయపు పన్ను శాఖ గత వారం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. ఎన్నికలు ముగిసే వరకు కంట్రోల్ రూమ్ 24/7 పని చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. ఎన్నికల నిర్వహణను ప్రభావితం చేసే నగదు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల తరలింపుపై గట్టి నిఘా ఉంచాలని ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

# దర్యాప్తు అధికారి రాంసింగ్ కొనసాగడంపై సుప్రీం అభ్యంతరం

(మొదటిపేజీ తరువాయి)

జరిపిన కోర్టు... దర్యాప్తు అధికారిని మార్చాలని.. లేదా ఇంకో అధికారిని నియమించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో తులశమ్మ కేసులో మరో దర్యాప్తు అధికారిపై సుప్రీం కోర్టుకు సీబీఐ నివేదిక అందజేసింది. రాంసింగ్‌తో పాటు మరొకరి పేరును సీబీఐ సూచించింది. అయితే రాంసింగ్‌ను కొనసాగించడంపై న్యాయమూర్తి ఎం ఆర్ షా అభ్యంతరం తెలిపారు. కేసు దర్యాప్తులో పురోగతి సాధించనప్పుడు రాంసింగ్‌ను కొనసాగించడంలో అర్థం లేదని న్యాయమూర్తి అన్నారు. వివేకా కేసులో విచారణ ఆలస్యం అవుతున్నందున ఏ5 శివశంకర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని ఆయన భార్య తులశమ్మ కోర్టును కోరారు. ఆ విషయాన్ని పరిశీలిస్తామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దీనిపై ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. అయితే ఈ కేసును దర్యాప్తును ఏప్రిల్ 15కల్లా పూర్తి చేస్తామని సీబీఐ కోర్టుకు తెలిపింది. దీంతో కొత్త దర్యాప్తు అధికారిని నియమించడం వల్ల దర్యాప్తు పూర్తి కావడానికి కనీసం మూడు నెలలు అయినా పడుతుందని, ఈలోగా ఏ 5 శివశంకర్ రెడ్డికి బెయిల్ ఇవ్వాలన్న తులశమ్మ తరపు న్యాయవాది సుప్రీంకోర్టును కోరారు.

# రాహుల్ పై కాంగ్రెస్ లోనే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

అనురాగ్ ఠాకూర్. వీర్ సావర్కర్‌పై తరచూ ఇలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ సావర్కర్‌ను ప్రశంసిస్తూ రాసిన లేఖనూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సావర్కర్ పాత్ర ఎప్పటికీ మరిచిపోలేమని ఇందిరా గాంధీ చెప్పారంటూ ఆ లెటర్‌ను షేర్ చేశారు. 1980లో రాసిన ఈలేఖను కోట్ చేస్తూ రాహుల్‌పై మండి పడ్డారు ఠాకూర్. అంతే కాదు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో సావర్కర్‌ను త్యాగానికి గుర్తుగా ఓ డాక్యుమెంటరీని కూడా రిలీజ్ చేశారని గుర్తు చేశారు. '

# మహాకూటమికి సావర్కర్ గండం..

(మొదటిపేజీ తరువాయి)

టోటల్‌గా మరాఠీ పాలిటిక్స్‌ని బాగానే డిస్టర్బ్ చేశారు రాహుల్ గాంధీ. ఒకేఒక్క మాట.. మహారాష్ట్ర పొలిటికల్ ఈక్వేషన్లను గజిబిజిగా మార్చేసింది. వీర్ సావర్కర్ పిరికివాడంటూ రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్య మరాఠీ పాలిటిక్స్ మీద పెను ప్రభావమే చూపుతోంది. సావర్కర్‌లా నేను ఎవరికీ లొంగిపోను, సారీ చెప్పను.. అంటూ మోదీనుద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు సగటు మరాఠీని సూటిగా తాకేశాయి. సావర్కర్ సెంటిమెంట్‌ని పొలిటికల్‌గా సొమ్ము చేసుకునే క్రమంలో ముందుకొచ్చింది శివసేన ఉద్ధవ్‌థాక్రే వర్గం. వీర్‌సావర్కర్‌ని అవమానించడం ద్వారా సత్యాగ్రహ ఉద్యమాన్ని గెలిపించాలనుకోవడం రాహుల్ అమాయకత్వమని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఉద్ధవ్ థాక్రే. శివసేన అధికార పత్రిక సామ్నాలో రాసిన ఎడిటోరియల్ కూడా రాహుల్‌ని తప్పుబట్టింది. తాజా పరిణామాలతో శివసేనకూ కాంగ్రెస్‌కీ మధ్య దూరం పెరిగింది. మొన్నటివరకూ కాంగ్రెస్-ఎన్‌సీపీ-శివసేన కలిసి మహారాష్ట్ర వికాస్ అఘాడీ పేరుతో మహా కూటమి అధికారంలో ఉండేది. ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు తర్వాత సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయి.. బీజేపీ సపోర్ట్‌తో కొత్త సర్కార్ ఏర్పాటైంది. డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన సీఎం షిండే.. తాము కూడా మహారాష్ట్ర వ్యాప్తంగా సావర్కర్ గౌరవ్ యాత్ర చేపడతామన్నారు. సావర్కర్‌ని అవమానించిన రాహుల్‌గాంధీని నిలదీయాలంటూ ఉద్ధవ్‌ని డిమాండ్ చేశారు. 2004లో మణిశంకర్ అయ్యర్ కూడా ఇలాగే సావర్కర్‌పై నోరు పారేసుకున్నారని, అప్పట్లో బాల్‌థాకరే పిలుపు మేరకు తామంతా.. కాంగ్రెస్ వాళ్లను చెప్పులతో కొట్టి బుద్ధి చెప్పామని గుర్తు చేశారు. మీరు మాత్రం కాంగ్రెస్‌తో కలిసిపోయి మరాఠీయిజాన్ని అవమానిస్తారా.. లేక ధైర్యంగా బైటికొచ్చేస్తారా అని ఛాలెంజ్ విసిరారు ఏక్‌నాథ్ షిండే. అటు.. రాహుల్ అనర్హత నేపథ్యంలో ప్రతిపక్షాల ఐక్యత వర్ధిల్లాలి అంటూ దేశవ్యాప్తంగా రాజకీయ నినాదం ఊపందుకుంది. తృణమూల్ కాంగ్రెస్ కూడా కాంగ్రెస్‌కి బాసటగా నిలిచి, బీజేపీ-వ్యతిరేక కూటమిలో చేరిపోయింది. కానీ.. శివసేన ఉద్ధవ్ వర్గం మాత్రం అపోజిషన్ కూటమికి దూరంగా ఉండిపోయింది. కాంగ్రెస్ పిలుపునిస్తున్న ఏ కార్యక్రమంలోనూ పాల్గొనడం లేదు. ప్రస్తుతం మహారాష్ట్ర అసెంబ్లీలో 45 సీట్లున్న కాంగ్రెస్ పార్టీ బలం.. ఉద్ధవ్‌కి చాలా కీలకం. కాంగ్రెస్‌కి ఉద్ధవ్ కటీఫ్ చెబితే వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో మహాకూటమి మనుగడ సాధ్యం కాకపోవచ్చు. వీర్ సావర్కర్‌పై రాహుల్‌గాంధీ చేసిన కామెంట్.. చివరికిలా.. మహారాష్ట్ర భవిష్యత్ రాజకీయాల్లో పెనుమార్పులకు దారితియ్యబోతోంది.

# నేపాల్ కు అమృత్ పాల్..?

(మొదటిపేజీ తరువాయి)

సింగేనా లేక అలా కనిపిస్తున్న మరొకరా అనే విషయాన్ని ధృవీకరించుకునే పనిలో ఉన్నారు పోలీసులు. అంతేకాకుండా అసలు సీసీటీవీ కెమెరా దృశ్యాలు కూడా అసలు ఢిల్లీ మార్కెట్ లోనివేనా అనే అనుమానాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే అమృత్ పాల్ నేపాల్‌లో ఉన్నట్టు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన కేంద్రం...నేపాల్‌ను అలెర్ట్ చేసింది. నేపాల్ నుంచి నకిలీ పాస్‌పోర్ట్‌తో వేరే దేశానికి పారిపోవాలని చూస్తున్నట్టు నిఘా వర్గాలు చెబుతున్నాయి. అక్కడి నుంచి పారిపోకుండా నేపాల్ అధికారులు నిఘా పెట్టాలని భారత్ కోరింది. ఖాట్మండ్‌లోని ఇండియన్ ఎంబసీ ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. నేపాల్ పరారయ్యేందుకు అమృత్ పాల్ స్కెచ్ వేస్తున్నాడని, వెంటనే అతడిని అరెస్ట్ చేయాలని తెలిపింది. ఈ మేరకు ఓ లేఖ కూడా రాసింది."నేపాల్ ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు మా విజ్ఞప్తి. అమృత్ పాల్ సింగ్ విదేశానికి పారిపోకుండా అడ్డుకోవాలని కోరుతున్నాం. వెంటనే అరెస్ట్ చేయండి. ఇండియన్ పాస్‌పోర్ట్ లేదా నకిలీ పాస్‌పోర్ట్‌తో వేరే దేశానికి పారిపోవాలని చూస్తున్నట్టు సమాచారం అందింది"ఇదే లెటర్‌ను నేపాల్‌లోని కీలక హోటల్స్‌కూ పంపారు. అమృత్ పాల్ సింగ్‌కు రకరకాల పేర్లతో పలు పాస్‌పోర్ట్‌లు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. పంజాబ్‌లోని జలంధర్ వద్ద పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన అమృత్...అప్పటి నుంచి పరారీలోనే ఉన్నాడు. అమృత్‌పాల్ సింగ్ నేపాల్ మీదుగా కెనడా పారిపోయే అవకాశాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే వారిస్ పంజాబ్ దే నేత కోసం భద్రతా దళాలు పంజాబ్ ను గాలిస్తున్నాయి. చాలా కాలం దుబాయ్ లో ఉన్న అమృత్‌పాల్ కు అక్కడే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐతో పరిచయాలు ఏర్పడ్డట్లు అధికారులు గుర్తించారు. అతడిని పాక్ ఐఎస్ఐ పావుగా వాడుకుంటోందని, పంజాబ్‌లో కల్లోలం సృష్టించడానికి అమృత్‌పాల్ ను వాడుకున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

## అర్ధరాత్రి ఇల్లు కూల్చివేత

**నెల్లూరు**

రాత్రి సమయంలో సాలుచింతలలో అధికారులు ఇల్లు తొలగించిన వైనం వివాదస్పదమయింది. బాధితులకు టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అండగా నిలిచారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఆదేశాలతోనే దొంగ చాటుగా ఇల్లు కూల్చివేతశారని బాధితులు ఆరోపించారు. పోలీసులను బందోబస్తు పెట్టీ సాలుచింతలలో ఇల్లు కూల్చేసారని వారు అవేదన వ్యక్తం చేసారు. పోలీసులు వైసీపీ కార్యకర్తలా.. రౌడీలా ప్రవర్తిస్తున్నారని కోటంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. భవిష్యత్ లో అనిల్ తో పాటు అతని అక్రమాలకు సహకరిస్తున్న పోలీసులు బారి మూల్యం చెల్లించుకోక తప్పదు అని కోటంరెడ్డి హెచ్చరించారు. మనుషులు ఇంట్లో ఉన్న సమయంలో ఇల్లు కుల్చెయ్యడంతో పలువురు గాయాలు అయ్యాయని అయన అన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డు పై రోడ్డు ప్రమాదం

**రంగారెడ్డి**

రాజేంద్రనగర్ఓఆర్ ఆర్ పోలీస్ అకాడమీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎమర్జెన్సీ లేన్ లో ఆగి ఉన్న లారీని ఒక కారు ఢీ కొట్టింది. వేగానికి లారీ కింద సగం వరకు కారు దూకుకొని వెళ్లింది. ఘటన లో కారు నడుపుతున్న డ్రైవర్ మృతి చెందాడు. కారు లో ఇరుకున్న మృతదేహన్ని ట్రాఫిక్, ఓఆర్ఆర్ సిబ్బంది క్రేన్ సహాయం తో బయటకు తీసారు. కారు గచ్చిబౌలి నుండి శంషాబాద్ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. . మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అన్నారు. మృతుడు కర్ణాటక కు చెందిన రేవన్ సిద్ధా గా గుర్తించారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## హెచ్ఎండీయే అధికారుల కొరడా

**రంగారెడ్డి**

గండీపేటలో మంగళవారం రాత్రి హచ్ఎండీయే అధికారులు పోలీసుల సహాయంతో ఆపరేషన్ కోకాపేట నిర్వహించారు. కోకాపేట లో ప్రభుత్వ భూమి కబ్జా అయిన విషయాన్ని గుర్తించి తెల్లవారుజామున భారీ పోలీసు బందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాలు కూల్చి వేసారు. కబ్జాదారుల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రాజన్న సన్నిధిలో రాములోరి కళ్యాణం

**రాజన్న సిరిసిల్ల**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణం జరగనుంది. ఈ నేపధ్యంలో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. గురువారం ఉదయం 11.20 నిమిషాలకు శుభ ముహూర్తముకు శ్రీరాముల కల్యాణం నిర్వహిస్తారు. పూల మాలలతో, జిమ్ము మనే విద్యుత్ లైట్లతో అంగరంగ వైభోగంగా ఏర్పాట్లు చేసారు. భక్తులు తిలకించేలా ఆలయ ఆరుబయట కల్యాణ వేదిక ఏర్పాట్లు చేసారు. బుధవారం నుంచి ఇప్పటికే సీతారాముల కల్యాణం ను తిలకించి, దర్శించుకొనుటకు భక్తులు వేములవాడ క్షేత్రానికి తరలి వస్తున్నారు.

## కారు, ఆటో ఢీపందిమందికి గాయాలు



**హన్మకొండ**

హనుమకొండ జిల్లా పరకాల భూపాలపల్లి జయశంకర్ జిల్లా ప్రధాన రహదారిపై చలి వాగు బ్రిడ్జి దగ్గర ఒక కారు, కూలీల ఆటో ఢీకొన్నాయి. ఘటనలో పది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారితో ఇద్దరి పరిస్థితి విషమంగా వుండడంతో పరకాల సివిల్ హాస్పిటల్ కు తరలించారు.

## ఇంద్ర బస్సు దగ్దం..ప్రయాణికులు క్షేమం

**సూర్యాపేట**

ఖమ్మం నుంచి హైదరాబాదుకు వస్తున్న ఇంద్ర బస్ లో మంటలు చెలరేగాయి. సూర్యాపేటలోని అంబేద్కర్ బొమ్మ దగ్గరలో షార్ట్ సర్క్యూట్ బస్సు పూర్తి గా దగ్ధం అయింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో దాదాపు 20 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. ఎవరికి ఎలాంటి ప్రాణహాని జరగలేదు

## లారీని ఢీకొన్న కారు..ఇద్దరు మృతి

**అనకాపల్లి**

సీతారాంపురం జంక్షన్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని విజయవాడ నుండి విశాఖపట్నం వెళ్తున్న వ్యాగనర్ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా నలుగురు గాయాలు పాలయ్యారు.గాయపడిన వారిని అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# సొంత సామాజిక వర్గమే వెన్నుపోటు

**విజయవాడ:**

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతుంది. ఇప్పటి వరకూ ఎలాంటి అసంతృప్తులు చోటు చేసుకోలేదు. మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అసంతృప్త నేతలు బయటపడ్డారు. మొత్తం నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ లైన్ ను ధిక్కరించి ఓటు వేశారు. వారిపై పార్టీ హైకమాండ్ సస్పెన్షన్ వేటు కూడా వేసింది. అయితే వైసీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన వారిలో ఎక్కువ మంది రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు. నలుగురిలో ముగ్గురు రెడ్లు, ఒకరు దళిత మహిళ ఉండటంతో జగన్ సామాజికవర్గీయులే పార్టీని దెబ్బతీస్తున్నారన్న టాక్ బలంగా వినపడుతుంది. ఏపీ రాజకీయాల్లో కులం ఆధారంగానే పార్టీ ఉంటుంది. తెలుగుదేశం పార్టీ కమ్మ సామాజికవర్గానికి చెందిన వారిదని, వైసీపీ రెడ్డి కులానికి చెందిన వారిదని, జనసేన కాపు కులానికి చెందినదన్న టాక్ బహిరంగంగానే వినిపిస్తుంటుంది. వినిపించిన విధంగానే ఆ సామాజికవర్గం ఆ యా పార్టీలకు అనుకూలంగా ఉంటుంది. మిగిలిన సామాజికవర్గాల వారు ఎటువైపు మొగ్గు చూపితే వారిదే విజయం. గత ఎన్నికల్లో బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు వైసీపీ వైపు చూడటంతోనే జగన్ విజయం సాధ్యమవుతుంది. రెడ్లు ఎటూ తన వెంటే ఉంటారని భావించి జగన్ మంత్రివర్గం లోనూ, వివిధ నియామకాల్లోనూ వారిని దూరంగా ఉంచారు. అది ఆ సామాజికవర్గంలో అసంతృప్తికి, అసహనానికి కారణమవుతుందన్న వార్తలు తరచూ వింటూనే ఉన్నాం. నిజానికి వైసీపీలో అరడజను వరకూ కమ్మ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలున్నారు. గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, దెందులూరు నుంచి అబ్బయ్య చౌదరి, మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్, పెదకూరపాడు నుంచి నంబూరు శంకరరావు, వినుకొండ నుంచి బొల్లా బ్రహ్మనాయుడులు ఉన్నారు. కానీ వీరెవరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కు పాల్పడలేదు. తమకు సీటు ఇచ్చినందుకు, ప్రాధాన్యత ఇస్తున్నందుకు నమ్మకంగానే ఉన్నారు. మంత్రివర్గంలో కొడాలి నాని తర్వాత మరొకరికి అవకాశం జగన్ కల్పించలేక పోయినప్పటికీ వారిలో అసంతృప్తి ఇసుమంతైనా కనిపించలేదు. తెలుగుదేశం పార్టీ కూడా వైసీపీలోని కమ్మ సామాజికవర్గం నేతల జోలికి వెళ్లలేదు. రెడ్డి సామాజికవర్గంపైనే టీడీపీ ఫోకస్ పెట్టడం కూడా పార్టీలో ఆందోళన కలిగిస్తుంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జగన్ కొంత సొంత సామాజికవర్గం పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని చెబుతున్నారు. ఎంపిక చేసుకున్న కొందరికే ఈ సామాజికవర్గంలో ప్రాధాన్యత ఉంటుంది తప్ప ఇంకెవ్వరికీ అవకాశాలు దక్కడం లేదు. తమ పార్టీగా జబ్బలు చరుచుకుని, ఛాతీ చూపిస్తూ ఎన్నికలకు ముందు వైసీపీ జెండా పట్టుకుని తిరిగిన రెడ్డి సామాజికవర్గం నేతలు ఇప్పుడు కామ్ అయిపోయారు. అందుకే పట్టభద్రుల నియోజకవర్గాల్లో పశ్చిమ, తూర్పు రాయలసీమలో రెడ్డి సామాజికవర్గం అభ్యర్థులను పోటీకి దింపినా గెలవలేకపోయారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# మేకపాటి వర్సెస్ అనిల్...

**నెల్లూరు:**

పార్టీ అధికారంలోకి రాగానే జగన్, అనిల్ కి మంత్రి పదవి ఇచ్చారు, దానికి ఆయన బాగా పనిచేసి శెహభాష్ అనిపించుకున్నారు. నెల్లూరు నగరంలో అనిల్ గురించే చర్చ అంతా, ఆయనకి హారతి పడుతున్నారు. నెల్లూరు ప్రజల్లో ఎవరి నోట విన్నా అనిల్, అనిల్ అనే పేరే వినపడుతోంది. అనిల్ అనిల్ అని అందరూ అంటున్నారు, అనిల్ గెలుస్తాడని కాదు, ఓడిపోతాడని..” అంటూ అనిల్ పై సెటైర్లు పేల్చారు వైసీపీ సస్పెండెడ్ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి. గతంలో ఆయనెప్పుడూ ఇంత సెటైరిక్ గా మాట్లాడలేదు. తొలిసారి జగన్ గొప్ప మహానుభావుడు అంటూ కౌంటర్ ఇచ్చారు. అనిల్ ని కూడా ఆయన టార్గెట్ చేశారు. అయితే ఈ గొడవ ముందు మొదలు పెట్టింది అనిల్ కావడం విశేషం. తననిరెచ్చగొట్టి, తనతో మళ్లీ మాటలు అనిపించుకోవద్దని అన్నారు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి. ఆ ముగ్గురు నెల్లూరు జిల్లాలో ఓడిపోవడం ఖాయం అంటూ మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ సస్పెండ్ అయిన ఎమ్మెల్యేల గురించి కామెంట్లు చేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఆయన కోటంరెడ్డిని టార్గెట్ చేద్దామనుకున్నారు, కానీ మేకపాటి బాగా హర్ట్ అయ్యారు. అందుకే ఆయన ప్రెస్ మీట్ పెట్టి మరీ అనిల్ ని ఉతికి



ఆరేశారు. అనిల్ సింగిల్ డిజిట్ మెజార్టీ ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. నోరు ఉంది కాబట్టే ఆయనకు జగన్ మంత్రి పదవి ఇచ్చారని చెప్పుకొచ్చారు. గతంలో తాము చాలామందిని మోటుకున్నామని, వయసులో ఉన్నావు కదా అని రెచ్చిపోవద్దని అన్నారు. నెల్లూరు అంతా అనిల్ గురించే మాట్లాడుకుంటున్నారని, ఆయన ఓడిపోతారని అనుకుంటున్నారని సెటైర్లు పేల్చారు మేకపాటి. తమ కుటుంబం సాయం పొందిన జగన్, తమకి అన్యాయం చేశారని మరోసారి మండిపడ్డారు.మేకపాటి కుటుంబం పేరు చెప్పగానే అందరికీ ముందు గుర్తొచ్చేది పెద్దాయన రాజమోహన్ రెడ్డి, ఆ తర్వాత మేకపాటి గౌతమ్ రెడ్డి మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్నా అర్థాంతరంగా ఆయన తనువు చాలించడంతో ఆయన స్థానంలో మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యే అయినా కూడా పెద్దగా ఆయన లైమ్ లైట్లోకి రాలేదు. 2004, 2009లో వరుసగా



కాంగ్రెస్ పార్టీనుంచి ఉదయగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు చంద్రశేఖర్ రెడ్డి. ఆ తర్వాత 2012లో ఉప ఎన్నికల్లో వైసీపీ తరపున బరిలో నిలిచి గెలిచారు. 2019లో తిరిగి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాంటి సీనియిర్ నేత, వైసీపీ పెట్టినప్పటి నుంచి పార్టీలో ఉన్న నేతపై ఇటీవల ఆ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. దీన్ని చాలాప్రెస్టీజియస్ గా తీసుకున్నారు మేకపాటి. అందుకే జగన్ ని పదే పదే టార్గెట్ చేస్తున్నారు. కోటంరెడ్డి దాదాపుగా టీడీపీలో చేరడం ఖాయం. ఆనం కూడా అటువైపే చూస్తున్నారు. ఉండవల్లి శ్రీదేవి కూడా అమరావతికి జై కొట్టి దాదాపుగా టీడీపీకి దగ్గరయ్యారు. ఇక మేకపాటి విషయం మాత్రం తేలడంలేదు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి గతంలో టీడీపీతో ఎప్పుడూ మంతనాలు సాగించలేదు. ఆయన విషయంలో కూడా టీడీపీ అంత సీరియస్ గా ఆలోచించలేదు. అందుకే ఆయన ఇండిపెండెంట్ గా అయినా పోటీ చేసి గెలుస్తానంటున్నారు.

# రాములోరి కళ్యాణానికి అంతా సిద్ధం

**ఖమ్మం:**

శ్రీరామ నవమి వేడుకలకు భద్రాద్రి ముస్తాబవుతుంది. భద్రాచలంలో మార్చి 30న ఆలయ సమీపంలోని మిథిలా మండపంలో సీతారాముల కల్యాణం జరపనున్నారు. భద్రాద్రిలో ఎటుచూసినా స్వాగత తోరణాలు, చలువ పందిళ్లతో కల్యాణ వైభవం కనిపిస్తోంది. రాములోరి కల్యాణ వేడుకను కనులారా వీక్షించేందుకు తరలిరానున్న అశేష భక్తజనానికి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వేల మంది స్టేడియం నుంచి ఉచితంగా రాములోరి కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంది. ఈనెల 31న శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించ ´నున్నారు. ఈవేడుకలను భక్తులు వీక్షించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామి కళ్యాణం మార్చి 30న నిర్వహించనున్నారు. దీని కోసం ఏర్పాట్లను చేస్తున్నారు. ఏటా శ్రీరామ నవమి రోజునే భద్రాచలంలో అభిజిత్ లగ్నంలో కళ్యాణం జరుగుతుంది. మిట్ట మధ్యాహ్నం ప్రతి యేడాది ఈ కళ్యాణం జరుగుతుంది. అయితే శ్రీరామ నవమి రోజునే కళ్యాణం భద్రాచలంలో ఎప్పుడు జరుగుతుందో అదే సమయంలో అయోధ్యలో కూడా కళ్యాణం జరుగుతుంది. వాడవాడలా కళ్యాణాలు జరుగుతుం టాయి. జానక్యా: కమలాంజనలి పుటే యా: పద్మరాగాయతా: సీతాదేవి చేతుల్లో ఉన్న ముత్యాలు పద్మరామమణుల్లా ప్రకాశించాయి. శ్రీ రాముడి శిరస్సుపై పడ్డ ఆముత్యాలు తెల్లని తలపాగా కాంతిలో కలిసి మంచి ముత్యాలుగా ప్రకాశిస్తాయి. నీలి మేఘ ఛాయ కలిగిన శ్రీరాముడి దేహం నుంచి జారిన తలంబ్రాలు ఇంద్రనీలామణుల్లా ప్రకాశిస్తాయిని, సీతారాముల కళ్యాణ తలంబ్రాలు ముత్యాలు సఖల శుభాలను కలగచేస్తాయని ఆదిశంకరాచార్యులు చెప్పారంట. వివాహ వేడుకల్లో అత్యంత ప్రాముఖ్యమైనది తలంబ్రాలు..భద్రాద్రి శ్రీరాముడి తలంబ్రాలకు ఒక్క ప్రత్యేకత కూడా ఉంటుంది. అన్ని కళ్యాణాల్లో తలంబ్రాలు పసుపు పచ్చగా ఉంటాయి. కానీ ఇక్కడ ఎరుపురంగులో ఉండడం విశేషంగా చెబుతారు. భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామి కళ్యాణంలో తలంబ్రాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈరోజు పెళ్లి కొడుకును చేసి ముత్తైవుదుల సమక్షంలో తలంబ్రాలను కలుపుతుంటారు. నైజామ్ నవాబు ముత్యాల తలంబ్రాలను , వారి ఆచారం ప్రకారం గులాం కలిపి పంపించే వారు. ప్రధానంగా నైజాం నవాబు కళ్యాణం కోసం బియ్యం, పసుపు తో పాటు, వారి ఆచార సాంప్రదాయం అయిన గులాల్ ను కూడ కలిపి పంపారంట. దీంతో అవి ఎరుపురంగులో ఉండేవి. భద్రాచలంలో తలంబ్రాలకు విశేష ప్రాధాన్యత ఉంది.రాష్ట్రం నుంచే కాకుండా దేశం నుంచే చాలా మంది ఈ తలంబ్రాలు కావాలని కోరుకుంటారు. వివాహ సమయంలో ఈ తలంబ్రాలను కలిపితే మంచి జరుగుతుందని, శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం దీని వల్ల దంపతులు సుఖ సంతోషాలతో ఉంటారని భావిస్తుంటారు. అయితే అవి రెండు కలసి పోయి తలంబ్రాలు ఎర్రగా మారాయని అంటారు. అందువల్ల అప్పటి నుంచి ముత్యాల తలంబ్రాలలో సెంట్ తోపాటు సుగంధ ద్రవ్యాలను కలుపడం ఆనవాయితీగా మారింది. 2022లో మాత్రమే భక్తుల సమక్షంలో శ్రీసీతారామచంద్రుల వివాహం జరిగింది.

## చిరుత మృతి

**నల్గోండ**



నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం, శేషమ్మగూడెం లో చిరుత అనుమానాస్పద మృతి చెందింది. గతంలో స్థానిక రైతులు వ్యవసాయ పొలాల దగ్గర చిరుత కనిపించిందని అధికారులకు సమాచారమిచ్చారు. దాంతో అప్పట్లో అర్ధరాత్రి వరకు అటవీశాఖ, పోలీసుల సెర్చింగ్ ఆపరేషన్ చేసి.. పాదముద్రలు సేకరించారు. చిరుత సంచారంపై క్లారిటీ ఇవ్వలేదరు. ఇన్ని రోజులుగా శేషమ్మగూడెం గ్రామస్తులు, రైతులు అందోళనలో వుండిపయారు. చివరకు గ్రామ శివారులోనీ కంపచెట్లలో చిరుత మృతదేహం లభ్యం అయింది.

## ఘనంగా టీడీపీఆవిర్భావ దినోత్సవం

**హైదరాబాద్**

తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నేతలు కెపిహెచ్బి జెఎన్టియు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పనీచిపెట్టిన నాయకులు బాణాసంచా కాల్చి ఎన్టీఆర్ రామారావు అమర్ రహే తెలుగుదేశం జిందాబాద్ చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి జై బాలయ్య అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు. కాలనీలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు. కాలనీలోని ప్రతి దిమ్మ వద్ద తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేసారు.

## కేటీఆర్ పై కుట్రలు చేస్తున్నారు

**హైదరాబాద్**

కేటీఆర్ పై కుట్రలు చేస్తున్నారు.. ప్రతిపక్షాల చర్యలు సరిగా లేవని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో నియంత పాలన సాగుతుందని అన్నారు. కేంద్రం ప్రతిపక్షాల గొంతును నొక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు దానికి చక్కటి ఉదాహరణ అని మండిపడ్డారు. లక్షల కోట్లు దోచుకున్న కార్పొరేట్ దొంగలపై ఎలాంటి విచారణలు ఉండవు కానీ లిక్కర్ స్కామ్ అంటూ అభూత కల్పనలతో కేంద్రం దూరాలోచన చేసి, ఎమ్మెల్సీ కవితను ఇబ్బందులు పెడుతున్నారని నిప్పులు చెరిగారు. అంతేకాకుండా మంత్రి కేటీఆర్ మీద కూడా కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రి కేటీఆర్ పై కూడా పేపర్ లీకేజీలో ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అంటూ మండిపడ్డారు. టీఆఎస్పీఎస్సీ ఛైర్మన్ నిజాయితీ పరుడని, ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు గుత్తా సుఖేందర్. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు అసత్యాలు ప్రచారం చేయడమే వారి పని ఆరోపించారు. సీఎం కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నాయకుడు అని, కేసీఆర్ నాయకత్వం తెలంగాణ కు శ్రీరామరక్ష అని అన్నారు. ప్రతిపక్షాల చర్యలు సరిగా లేవుని, రాష్ట్రంను ఇబ్బందులు పెట్టడమే పనిగా పెట్టుకుంది కేంద్రం అంటూ నిప్పులు చేరిగారు. గవర్నర్ వ్యవస్థ కూడా భ్రష్టు పట్టించారు బీజేపీ వాళ్ళు అంటూ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణలో బిల్లులను పెండింగ్ లో పెట్టి అభివృద్ధిని అడ్డుకుంటున్నారు గవర్నర్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఏలేరుకాల్వలో మృతదేహాలు

**విశాఖపట్టణం**

విశాఖలో వరప్రసాద్ దంపతుల అదృశ్యంలో మిస్టరీ ఇంకా వీడలేదు.. అయితే తాజాగా ఆ కొప్పాక ఏలేరు కాలువలో రెండు డెడ్‌బాడీలు దొరికాయి.. ఆ డెడ్‌బాడీలు వరప్రసాద్ దంపతులదేనా అన్నది ఇంకా క్లారిటీ రాలేదు.. ప్రస్తుతం పోలీసులు ఆ డెడ్‌బాడీలను పరిశీలిస్తున్నారు.. అటు కుటుంబసభ్యులు కూడా మరికాసేపట్లో స్పాట్‌కి చేరుకుంటారు.. అనంతరం క్లారిటీ రానుంది. వరప్రసాద్ దంపతుల అదృశ్యంపై ఇప్పటికే కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.ఇక నిన్న ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సూసైడ్ సెల్ఫీ తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయారు వరప్రసాద్, మీరా..ఆ తర్వాత వరప్రసాద్ బైక్, చెప్పులు, హ్యాండ్ బ్యాగ్, మొబైల్ కొప్పాక ఏలేరు కాలువ వద్ద లభించాయి..దీంతో ఆ కాలువలో దూకి ఆత్మహత్మ చేసుకున్నారా అని..నిన్నటి నుంచి గజ ఈతగాళ్లతో ఆ కాలువలో గాలించారు పోలీసులు..అదే కాలువలో రెండు డెడ్‌బాడీలు లభించాయి..బైక్ లభించిన చోట 2కిలోమీటర్ల దూరంలో లభ్యం అయ్యాయి..అవి వరప్రసాద్ దంపతులదేమోనని అనుమానం వ్యక్తం అవ్వుతోంది..అటు ఆ డెడ్‌బాడీల్లో ఒకటి సెల్ఫీ వీడియోలో ఉన్న షర్టుతో పైకి తేలుతుండడంతో అనుమానం కాస్త బలపడుతుంది..ఏది ఏమైనా కుటుంబసభ్యులు వచ్చి వాటిని గుర్తించేవరకు ఈ మిస్టరీ వీడేలా లేదు.

## లారీ ఢికనడంతో కూలీ మృతి

**గన్నవరం**

గన్నవరం మండలం బీబీ గూడెం దాసరి కాలనీ వద్ద వ్యవసాయ కూలీల ట్రాక్టర్ ను గ్రావెల్ క్వారీ లారీ ఢీకొంది. బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్ లో వరి కుప్ప నూర్చేందుకు 9 మంది కూలీలు ట్రాక్టర్ లో వెళుతున్నారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. 8 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# అమరావతిపై కేటీఆర్ షాకింగ్ కామెంట్స్

**విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై తెలంగాణ మంత్రి కేటీఆర్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కార్పొరేట్ సంస్థల విరాళాలతో హైదరాబాద్ సుందరీకరణ పనులను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. హైదరాబాద్ పట్టణం గురించి .. హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతల గురించి ప్రసంగించారు. ఈ సందర్భంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెలవప్‌మెంట్ అథారిటీ విస్తీర్ణం గురించి ప్రస్తావించారు. దేశంలోనే హెచ్ఎండీఏ అతి పెద్దదన్నారు. ఈ సందర్భంలోనే అమరావతిని గుర్తు చేసుకున్నారు. హెచ్ఎండీఏ కంటే అమరావతి అతి పెద్దదిగా నిర్ణయించారని..కానీ ప్రస్తుతం అక్కడ పనేం జరగడం లేదన్నారు. అంటే... పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్న అర్థంలో మాట్లాడారు. కేటీఆర్ విశాఖ, విజయవాడ, గుంటూరు నగరాల గురుంచి కూడా మాట్లాడారు. అవి కూడా బాగున్నాయన్నారు. అయితే కాస్త హాస్యోస్ఫోరకంగా ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో



గుంటూరుకు చెందిన ఓ మిత్రుడు తనకు చెప్పిన విషయాన్ని ఓ సమావేశంలో చెబితే పెద్ద వివాదం అయిందని అందుకే అలాంటి విషయాలను ప్రస్తావించబోనన్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా పోయింది. దీంతో అప్పటి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ఖరారు చేసి సీఆర్డీఏను ఏర్పాటు చేసింది. 2014లో సీఆర్డీఏ చట్టాన్ని ముందుకు తెచ్చింది. కృష్ణాజిల్లా నందిగామ మొదలు, గుంటూరు జిల్లా చిలకలూరిపేట వరకు సీఆర్డీఏ విస్తరించింది. 17 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని నగరంతో పాటు 8630 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ వ్యవస్థ ఏర్పాటైంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రెండు నగరపాలక సంస్థలు, పది మున్సిపాలిటీలు, 58 మండలాలు సీఆర్‌డీఏ పరిధిలో ఉంటాయి. ఉడాలో ఉన్నవాటితోపాటు నూతనంగా కృష్ణా జిల్లాలోని మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల, పామర్రు, గుడ్లవల్లేరు, మోపిదేవి మండలాలు సీఆర్‌డీఏ పరిధిలోకి చేర్చారు. వీటితోపాటు గుంటూరు జిల్లాలోని వేమూరు, కొల్లూరు, అమృతలూరు, పెదకూరపాడు, ముప్పాళ్ల, అచ్చంపేట, క్రోసూరు మండలాలు పూర్తిగానూ, పెదనందిపాడు, నాదెండ్ల మండలాల్లో కొన్ని గ్రామాలు సీఆర్‌డీఏ పరిధిలోకి వచ్చాయికోర్ క్యాపిటల్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఎన్నో ప్రణాళికలు వేసింది. దాదాపుగా రూ. యాభై వేల కోట్ల విలువైన పనులు రాజధానిలో జరిగేవి. అయితే ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ అమరావతి నిర్మాణ పనుల్ని పూర్తిగా నిలిపివేశారు. నాలుగేళ్ల నుంచి అక్కడ ఒక్క పని కూడా సాగడం లేదు. తర్వాత మూడు రాజధానుల వివాదం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టులో ఉంది. అమరావతిలో నిర్మాణాలు జరుగుతూ ఉంటే.. పనులు కొనసాగుతూ ఉంటే... హెచ్ఎండీఏ కన్నా పెద్దది అయి ఉండేదన్న ఉద్దేశంలో కేటీఆర్ ఆ వ్యాఖ్యలు చేసినట్లుగా అర్థం చేసుకోవచ్చు.

# తమ్మినేనికి నకిలీ సర్టిఫికెట్ టెన్షన్

శ్రీకాకుళం:

తమ్మినేని నకిలీ సర్టిఫికెట్‌తో లా అడ్మిషన్ తీసుకున్నారంటూ రాష్ట్రపతికి తెలుగుదేశం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఫిర్యాదు చేశారు. తాను డిగ్రీ చదవలేదంటూ తమ్మినేనే స్వయంగా ఒక ఇంటర్వ్యూలో చెప్పారని ఆ ఫిర్యాదులో కూన పేర్కొన్నారు. ఎన్నికల అఫిడవిట్ లో కూడా తమ్మినేని డిగ్రీ చదవలేదనే పేర్కొన్నారన్న కూన ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అలాగే ఇదే విషయంపై ఏపీ, తెలంగాణ గవర్నర్లు, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎం జగన్..కు లేఖలు రాశారు. తమ్మినేని సీతారాం స్పీకర్ అయిన తర్వాత హైదరాబాద్ ఎల్బీ నగర్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో 2019-20లో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో అడ్మిషన్ తీసుకున్నారని లేఖలో పేర్కొన్నారు. లా కోర్సులో చేరాలంటే డిగ్రీ, లేదంటే అందుకు సమానమైన కోర్సు పూర్తి చేసి ఉండాలని, కానీ తమ్మినేని డిగ్రీ కానీ, అలాంటి మరే కోర్సు కానీ చదవలేదని అన్నారు. ఈ విషయాన్ని ఆయనే గతంలో ఒక యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ్మినేని స్వయంగా పేర్కొన్నారని కూన గుర్తు చేశారు. అంతేకాదు, 2019 సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లోనూ తన అత్యున్నత విద్యార్హత ఇంటర్మీడియెట్ మాత్రమేనని, శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ చదువుతూ మధ్యలోనే మానేశానని ఆయన స్వయంగా వెల్లడించిన విషయాన్ని కూన రవికుమార్ ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, తమ్మినేని లా పరీక్షలకు హాజరైనట్టు వివిధ దినపత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగ్‌ను, ఎన్నికల అఫిడవిట్‌ను కూడా ఆయన ఆ లేఖలకు జత చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలా నకిలీ సర్టిఫికెట్లతో అడ్మిషన్ తీసుకోవడం సరికాదని, విలువలకు, నైతిక ప్రవర్తనకు కట్టుబడలేదని, కాబట్టి ఆయన శిక్షార్హుడని, తమ్మినేనిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా చట్టంముందు అందరూ సమానమేనని చాటిచెప్పాలని ఆయన ఆ లేఖలో కోరారు.

# ముగ్గురు మంత్రులపై వేటు తప్పదా...?

**విజయవాడ:**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసంతృప్తితో రగిలిపోతున్నారా? పట్టభద్రుల, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిరాశపరచడంపట్ల అసహనంతో ఉన్నారా? మంత్రుల తీరు మార్చుకోవాలని హెచ్చరించినా మార్పు రాకపోవడంతో ఆగ్రహంతో ఉన్నారా? ఎమ్మెల్యే, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిణామాల నేపథ్యంలో చర్యలకు సీఎం జగన్ ఉపక్రమించారా? అందుకే ప్రస్తుతం జగన్ మౌనం దాల్చారా? ఇటీవల ఏలూరు జిల్లాలో జరిగిన సభలో కూడా రాజకీయాలపై సవాళు విసరకుండా.. వైనాట్ 175 అనే నినాదం ఇవ్వకపోవడానికి కారణం కూడా ఇదేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాభంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర నిరాశలో ఉన్నారని ఇందులో భాగంగా మంత్రివర్గ విస్తరణకు శ్రీకారం చుట్టబోతున్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. ఇద్దరు ముగ్గురు మంత్రులను తప్పిస్తారంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులోభాగంగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కానున్నారంటూ వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పట్టభద్రుల, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వెల్లడవటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీ శ్రేణులపై తీవ్ర అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. పరిపాలన రాజధానిగా విశాఖను ప్రకటించినప్పటికీ ఉత్తరాంధ్రలో ఓడిపోవడం.. వైసీపీకి కంచుకోట అయిన రాయలసీమ ప్రాంతాల్లో కూడా వైసీపీ అభ్యర్థులు ఓడిపోవడంపై సీఎం జగన్ ఆగ్రహంతో రగిలిపోతున్నారట. అంతేకాదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎట్టి పరిస్థితుల్లో గెలవకూడదనే లక్ష్యంతో ఉన్న జగన్ పలు బాధ్యతలను మంత్రులు, మాజీమంత్రులు, పార్టీ సీనియర్ నేతలకు అప్పగించారు. విందులు సైతం ఏర్పాటు చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేరుగా రంగంలోకి దిగి ఫోన్ చేసి మరీ బుజ్జగించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ అసమ్మతి ఎమ్మెల్యేలు మీరేం చెప్పినా సరే.. మేము చేసేది చేస్తాం అన్నట్లు జగన్‌కు క్రాస్ ఓట్లు వేసి మరీ నిరూపించారు. దీంతో వైఎస్ జగన్ బొక్కబోర్లా పడ్డారు. ప్రభుత్వ సలహాదారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఓడిపోయినప్పటికీ పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది. వైనాట్ 175 అని ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని కానీ లోలోపల మాత్రం ఆ ఫలితాలు వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు పార్టీ వర్గాల నుంచి సమాచారం అందుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాస్త దూకుడు తగ్గించారు. ప్రభుత్వ పరంగా సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారు. అయితే ఇటీవలే ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధుల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంత ఉత్సాహంగా కనిపించలేదు. అంతేకాదు ప్రతీ సభలోనూ ప్రతిపక్షాలను తూర్పారబట్టే జగన్ అసలు వాటి ఊసేఎత్తలేదు. కేవలం చంద్రబాబు నాయుడు హయాంలో బకాయిలు అంశాన్ని మాత్రమే ప్రస్తావించారు. అంతేకాదు వైనాట్ 175 అనే నినాదం పలకనే పలకలేదు. దీంతో సీఎం జగన్ పర్యటన, సభలో వ్యవహరించిన తీరుపై వైసీపీ నేతల్లో ఆందోళన కలిగింది. పార్టీలో ఏదో జరుగుతుందని గుసగుసలాడుకున్నారు. తుఫాను వచ్చే ముందు వాతావరణం ప్రశాంతంగా ఉన్నట్లు సీఎం జగన్ మౌనంగా ఉన్నారంటే ఏదో జరగబోతుందని చర్చ జరిగింది. ఊహించినట్లుగానే టీడీపీకి ఓటు వేసిన ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడింది. వైసీపీ నుంచి గెలుపొంది టీడీపీకి క్రాస్ ఓటు వేసిన ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేసిన అధిష్టానం ఇక మంత్రులపై వేటుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మార్చి 14న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొందరు మంత్రులపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రుల పనితీరు మార్చుకోవాలని లేని పక్షంలో నలుగురు ఐదుగురు మంత్రులను మార్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పుకొచ్చారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనుకున్న టైం రానే వచ్చినట్లు తెలుస్తోంది. కొందరు మంత్రులను మార్చడంతోపాటు శాఖలను కూడా మారుస్తారని ప్రచారం జరుగుతుంది. ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో సీఎం వైఎస్ జగన్ భేటీ అవుతారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రస్తుత తరుణంలో మంత్రివర్గ విస్తరణకు శ్రీకారం చుడతారా అన్న చర్చ జరుగుతుంది. ఇంకా ఎన్నికలకు ఏడాది సమయం మాత్రమే ఉంది. మంత్రివర్గంలో బెర్త్ ఆశించే వారి సంఖ్య చాంతాడంత ఉంది. ఇలాంటి తరుణంలో మంత్రివర్గవిస్తరణ జరిగితే తేనెతుట్టెను జగన్ కదిపినట్లేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇప్పటికే పార్టీలో అసంతృప్తులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ అసమ్మతి మరింత పెంచేందుకు మంత్రివర్గ విస్తరణ కారణమవుతుందని చెప్తున్నారు. అంతేకాదు ఏడాది కాలం సమయం ఉండగా కేబినెట్‌లో చోటు దక్కించుకునేవారు ఏం ప్రూఫ్ చేసుకుంటారనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మంత్రి ఆయా శాఖలోని అన్ని అంశాలపై అవగాహన తెచ్చుకోవడానికి చాలా సమయం పడుతుందని అలాంటిది ఏడాదిలో కొత్త మంత్రులు సాధించేదేముందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కేవలం పాలనపరమైన అంశాలపైనే ఉంటుందని కొందరు వాదిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, ఆమోదించిన బిల్లులపై గవర్నర్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్చిస్తారని మరో ప్రచారం జరుగుతుంది. మరి సీఎం జగన్ మదిలో ఏముందో భేటీ తర్వాతే తెలుస్తుంది.

# ఇక మండే కాలమే

**హైదరాబాద్ :**

ఛత్తీస్‌గఢ్ నుంచి ఉన్న ద్రోణి నేడు మరఠ్వాడ నుంచి ఇంటీరియర్ కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకూ సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తు వద్ద కొనసాగుతూ ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇక ఇప్పటిదాకా అక్కడక్కడ జల్లులు కురవగా.. నేటి నుంచి వాతావరణం తెలంగాణలో పొడిగా ఉండనుందని వాతావరణ అధికారులు తెలిపారు. మార్చి 29 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. మార్చి 31న మాత్రం తెలంగాణలో ఓ మోస్తరు నుంచి అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘాలు పట్టి ఉంటుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సాయంత్రం లేదా రాత్రి సమయంలో ఉరుములతో కూడిన మేఘాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 37 డిగ్రీలు, 24 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఆగ్నేయ దిశల నుంచి గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది" అని వెదర్ బులెటిన్ లో పేర్కొన్నారు. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 36.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.0 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 069 శాతం నమోదైంది. ఏపీలో నేడు ఎక్కడా వర్షాలు పడే అవకాశం లేదని అమరావతిలోని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఉరుములు, మెరుపులు లాంటి వాతావరణంతో పాటు బలమైన గాలులు దాదాపు 30 నుంచి 40 కిలో మీటర్ల వరకూ వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉత్తర కోస్తా, యానం, దక్షిణ కోస్తాలోని అన్ని జిల్లాల్లో ఈ రకమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. వచ్చే 5 రోజుల పాటు ఇదే రకం వాతావరణ పరిస్థితి ఉంటుందని తెలిపారురానున్న నాలుగైదు రోజుల పాటు దక్షిణ భారతదేశంలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షం కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దక్షిణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, మహేలలో వాతావరణం మరోసారి ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో బుధవారం (మార్చి 29) ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకాశం ఉంది. వాతావరణ శాఖ ప్రకారం, మండుతున్న వేడి తర్వాత, నెల చివరి రెండు రోజుల్లో (30-31 మార్చి) తాజా రౌండ్ వర్షం ప్రారంభమవుతుంది. ఈ రెండు రోజుల్లో న్యూఢిల్లీలో తేలికపాటి వర్షం లేదా చినుకులు పడవచ్చు. మార్చి 30న, న్యూఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 19 మరియు గరిష్ట ఉష్ణోగ్రత 32.0 ఉండవచ్చు. మార్చి 31న కనిష్ట ఉష్ణోగ్రత 18, గరిష్ట ఉష్ణోగ్రత 28గా నమోదయ్యే అవకాశం ఉంది. దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్, కేరళలో వర్షాలు కురిసిన తర్వాత ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నాయి. అదే సమయంలో, ఒడిశా, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం మరియు పశ్చిమ బెంగాల్‌లోని త్రిపుర, కేరళ, మహేలోని గంగా తీర ప్రాంతాలలో 30 నుండి 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఉష్ణోగ్రతలో చెప్పుకోదగ్గ మార్పులు ఏమీ ఉండవు. మార్చి 30, 31 తేదీల్లో లక్నోలో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనితో పాటు గాలులతో పాటు వర్షం కూడా కనిపిస్తుంది. పంజాబ్‌లోని జలంధర్‌లోనూ వర్షాలు కొనసాగుతాయి. మార్చి 30 నుంచి ఏప్రిల్ 3 వరకు వర్షం కారణంగా వాతావరణం కాస్త చల్లగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# మెట్రో అడుగులు ప్రారంభించిన ఎల్ అండ్ టీ

**హైదరాబాద్:**

హైదరాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో రైలు ప్రాజెక్టు కోసం మరో ముందడుగు పడింది. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకూ నిర్మించే మెట్రో పిల్లర్ల కోసం భూసార పరీక్ష ప్రారంభం అయింది. ఈ సామర్థ్య పరీక్షలు ప్రారంభించినట్లు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు కోసం అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్ మార్కింగ్ పనులు పూర్తయినట్లు చెప్పారు.

భూసార పరీక్షలో భాగంగా ఐకియా జంక్షన్ నుంచి శంషాబాద్ వరకు అక్కడక్కడ 100 మెట్రో పిల్లర్ల స్థలాలను ఎంపిక చేసి సరిగ్గా పిల్లర్ నిర్మించే ప్రదేశంలోనే నమూనాలను తీసుకొని భూ సామర్థ్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు పిల్లర్ నిర్మించే చోట 40 అడుగుల లోతు వరకు తవ్వి మెట్రో పిల్లర్ నిర్మాణానికి అనుకూలమా లేదా అనేది పరిశీలిస్తామని అన్నారు. ఈ మొత్తం భూసార పరీక్షలు చేసేందుకు రెండు నెలల సమయం పడుతుందని చెప్పారు. భూ సామర్థ్య పరీక్షలతో స్తంభాల పునాదులు ఏ మేరకు తవ్వాలనే దానిపై స్పష్టత రావడంతోపాటు, టెండర్ ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్లకు కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగే భూమి తీరుపై అవగాహన కలుగుతుందని మెట్రో ఎండీ చెప్పారు. రాయదుర్గం నుంచి ఎయిర్ పోర్టుకు నిర్మించే మెట్రో మార్గం రెండు ఫ్లైఓవర్ల మీదుగా వెళ్లనుంది. మొదట రహేజా మైండ్ స్పేస్ చౌరస్తా, బయో డైవర్సిటీ చౌరస్తాల్లో ఫ్లై ఓవర్ల మీదుగా వెళ్తే.. ఆ తర్వాత ఖాజాగూడ చెరువు పక్కన ఎత్తయిన కొండలతో కూడిన ప్రాంతం ఉంది. ప్రతిపాదిత మెట్రో మార్గంలో భూ సేకరణ సమస్య తక్కువగా ఉన్నప్పటికి వెళ్లే మార్గంలో ఉన్న ఫ్లై ఓవర్లు, కొండ ప్రాంతాలే అధికారులకు సవాలుగా మారుతున్నాయి. కొండలను చీల్చకుండా మెట్రో మార్గం కోసం పిల్లర్లను నిర్మించాల్సి వస్తున్నది. ఇలా రెండు చోట్ల ఎత్తయిన కొండ ప్రాంతాలను గుర్తించిన మెట్రో అధికారులు ఆ ప్రాంతాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో మొత్తం 69.2 కిలోమీటర్ల పొడవుతో కూడిన మార్గంగా దేశంలో ఇప్పటిదాకా ఢిల్లీ తర్వాత రెండో స్థానంలో ఉండేది. కానీ, ఇప్పుడు మూడో స్థానానికి పడిపోయింది. బెంగళూరు నగరంలో ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ కొత్తగా 13.71 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని ప్రారంభించారు. దీంతో బెంగళూరు నమ్మ మెట్రో 70 కిలోమీటర్లకు చేరింది. ఫలితంగా హైదరాబాద్ మెట్రో 69.2 కిలోమీటర్లతో మూడోస్థానానికి దిగజారింది. 348 కిలోమీటర్ల పొడవుతో ఢిల్లీ మెట్రో రైల్ మార్గం మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ రోజుకు 42 లక్షల మంది ప్రజలు మెట్రో రైళ్లలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 255 మెట్రో రైల్ స్టేషన్లు ఉన్నాయి. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణపై సంవత్సరాల తరబడి పాలకులు ప్రకటనలు చేస్తున్నారేగానీ క్షేత్ర స్థాయిలో విస్తరణకు తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. ఇతర మెట్రో నగరాల్లో మెట్రో రైలుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి విస్తరణ పనులను శరవేగంగా చేస్తున్నారు. కానీ, హైదరాబాద్ నగరంలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది.

## కేటీఆర్ లెటర్

హైదరాబాద్ మెట్రో రైల్ రెండోదశ ప్రస్తుత తరుణంలో సాధ్యం కాదంటూ కేంద్రం చేతులెత్తేయడంపై మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి ఘాటైన లేఖ రాశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరికి లెటర్ పంపారు. అత్యంత రద్దీ కలిగిన హైదరాబాదులో మెట్రో రైల్ ప్రాజెక్టు రెండోదశ సాధ్యం కాదని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన నగరాలకు మాత్రం పక్షపాతధోరణితో మెట్రో ప్రాజెక్టులు ఇస్తున్న విషయాన్ని కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. గాంధీనగర్, కొచ్చి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పాటు చాలా తక్కువ జనాభా కలిగిన లక్నో, వారణాసి, కాన్పూర్, ఆగ్రా, ప్రయాగ్ రాజ్, మీరట్ వంటి ఉత్తరప్రదేశ్‌లోని చిన్నపట్టణాలకు మెట్రో ప్రాజెక్టులను కేంద్రం కేటాయించిన విషయాన్ని కేటీఆర్ లేఖలో గుర్తుచేశారు. జనాభా రద్దీ తక్కువ ఉన్న నగరాలకు అన్ని అర్హతలు ఉంటే, హైదరాబాద్ నగరానికి మాత్రం ఏం తక్కువ అని కేంద్రాన్ని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. మెట్రో రైల్ విస్తరణ అర్హత లేదని చెప్పడంతో ఆశ్చర్యపోయానని కేటీఆర్ అన్నారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరంగా హైదరాబాద్ ఉందని, ఇలాంటి నగరంలో ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాదన అర్థరహితమని ఆయన లేఖలో స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అనేక చిన్న నగరాలు, పట్టణాలు మెట్రో రైల్ ప్రాజెక్టులకి అర్హత సాధించినప్పుడు.. హైదరాబాద్ మెట్రో నగరం మాత్రం ఎందుకు ఆ అర్హత పొందదని కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం పక్షపాత దృక్పథంతో తీసుకున్న నిర్ణయమేనన్న భావన కలుగుతోందని కేటీఆర్ లేఖలో తెలిపారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి అన్ని అర్హతలు, అనుకూలతలు ఉన్న వివిధ రంగాల్లోని ప్రాజెక్టులు, కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను అనేకసార్లు సీఎం కేసీఆర్ తోపాటు స్వయంగా తాను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చామన్నారు. అయినా కేంద్రం నుంచి ఇప్పటిదాకా ఎలాంటి సానుకూల స్పందన రాలేదన్నారు. ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వ పట్టణ అభివృద్ధి శాఖకు మెట్రో రైల్ రెండో దశకు అవసరమైన అన్ని రకాల సమాచారాన్ని అందించడంతోపాటు డీటెయిల్డ్ ప్లానింగ్ రిపోర్ట్ (డిపిఆర్) సైతం అందించామన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, ఖఊఆ గణాంకాలు, ఇతర అర్హతలను, సానుకూలతలను అనేకసార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ మున్సిపల్ శాఖ తరపున గతంలో అందించిన సమాచారానికి సంబంధించిన నివేదికలను కేటీఆర్ జత చేశారు.

## అమలాపురం కేసులు ఉపసంహరణ



**విజయవాడ**

అమలాపురం అల్లర్ల కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని వివిధ వర్గాల నుంచి వచ్చిన రిక్వస్ట్ మేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఏర్పడ్డ విభేదాలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నట్టు సీఎం జగన్ ప్రకటించారు. స్థానికంగా ఉన్న నాయకులు కూడా ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.క్యాంపు కార్యాలయంలో కోనసీమ నేతలు, సామాజిక వర్గాల నాయకులతో సీఎం మంగళవారం రోజు సమావేశం అయ్యారు. అమలాపురం ఘటనలో నమోదైన కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. సీఎం జగన్ నిర్ణయంపై కోనసీమ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తరతరాలుగా మీరంతా అదే ప్రాంతంలో కలిసి మెలిసి జీవిస్తున్నారని.. అక్కడే పుట్టి, అక్కడే పెరిగి జీవిత చరమాంకం వరకు అక్కడే ఉంటున్నారని తెలిపారు. రేపు అయినా అక్కడే పుట్టాలి, అక్కడే పెరగాలి, అక్కడే జీవితాల్ని ముగించాలన్నారు. అందుకే భావోద్వేగాల మధ్య కొన్ని ఘటనలు జరిగినపుడు.. వాటిని మర్చిపోయి మునుపటిలా కలిసిమెలిసి జీవించాలన్నారు. లేకపోతే భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. కేసుల అంశాన్ని ప్రస్తావిస్తూ.. దీన్ని ఇలా లాగుతూ పోతే మనుషుల మధ్య దూరం పెరుగుతుందన్నారు. దీని వల్ల నష్టపోయేది మనమేనని.. అందుకే అందరం కలిసి ఉండి ఆప్యాయతతో మెలగాలన్నారు. చిన్న చిన్న గొడవలు, మనస్పర్థలు, అపోహలు ఉన్నా పక్కన పెట్టి ఆప్యాయంగా మాట్లాడుకుందామన్నారు. తప్పులు భూతద్దంలో చూసుకోకుండా ఒకరికొకరు కలిసిపోదామన్నారు. అందరం కలిసి కట్టుగా ఒక్కటవుదాం, మిమ్మల్ని ఒకటి చేయడం కోసమే ఈ ప్రయత్నమంతా చేస్తున్నామన్నారు. వాలంటీర్లకు తోడుగా గృహ సారథులు కూడా ఉంటారని.. వ్యవస్థలో పారదర్శకంగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అర్హత ఉన్న వారికి ఏ పథకం అయినా అందని పరిస్థితి ఉండకూడదనేది మన విధానమన్నారు. కులం చూడకుండా, మతం చూడకుండా ఎవరికి అర్హత ఉంటే వారికి అన్ని ఇస్తున్నామని సీఎం జగన్ చెప్పుకొచ్చారు. అలాగే రూ. 2 లక్షల కో?ల డీబీటీ దేశ చరిత్రలో ఎన్నడూ చూడలేదన్నారు. రూపాయి లంచం లేకుండా ఈ స్థాయిలో ఏరోజూ జరగలేదన్నారు. టీడీపీ హయాంలో తన పాదయాత్రలో లోనే? ల గురించి ప్రస్తావన వచ్చిందని... అప్పుడు లోన్ ల కోసం లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అవికూడా అక్కడక్కడా అరకొర అందేవన్నారు. ఇప్పుడు ప్రతీ ఇంటికీ సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. లంచాలు లేని ఇంత మంచి వ్యవస్థను తీసుకొచ్చామని, మంచి చేసే విషయం ఏం చూడకుండా చేస్తున్నామని వివరించారు. ఇలాంటి వ్యవస్థ ఉంటేనే సమాజానికి మంచి జరుగుతందన్నారు. అలాగే ఏ కారణం చేతనైనా ఎవరైనా మిస్ అయితే వారిని చేయి పట్టుకొని నడిపించడానికి కార్పొరేషన్లు కూడా ఎర్పాటు చేశామన్నారు. ఇది మంది పరిణామం అని, దేవుడి దయ వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మీరంతా మనస్ఫూర్తిగా ముందుకు వచ్చారని.. మంచి వాతావరణం ఉండాలని మనసారా కోరుకుంటున్నట్లు చెప్పారు.

## సిట్ కు స్పందించని రేవంత్, సంజయ్

**హైదరాబాద్**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో సిట్ తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. ఈకేసుకు సంబంధించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌లకు నోటీసులు పంపించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో తదుపరి చర్యలకు ప్లాన్ చేస్తోంది.పేపర్ లీక్ వ్యవహారంలో చేసిన ఆరోపణలకు ఆధారాలు అడిగింది సిట్. దీనికి సంబంధించి ఇద్దరికీ నోటీసులు పంపించినా స్పందించలేదంటున్నారు సిట్ అధికారులు. అయితే తన ఆరోపణలకు సంబంధించి సిట్‌కి ఆధారాలు ఇచ్చానంటున్నారు రేవంత్. అదే సమయంలో తమకు ఎలాంటి ఆధారాలు చూపించలేదంటున్నారు సిట్ అధికారులు. ఇక బండి సంజయ్ తరఫున బీజేపీ లీగల్ సెల్ సిట్ ఆఫీస్‌కి వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే తాము ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో తదుపరి చర్యలకు సిట్ సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రేవంత్, సంజయ్‌లపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో న్యాయసలహా తీసుకుంటున్నారు సిట్ అధికారులుమరోవైపు టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో.. తనపై నిరాధారమైన, అసత్య ఆరోపణలు చేశారంటూ మంత్రి కేటీఆర్ రేవంత్, బండి సంజయ్‌లకు లీగల్ నోటీసులు పంపించారు. ఈ వ్యవహారంలో పదేపదే అనవసరంగా తన పేరు లాగుతున్నారని న్యాయవాది ద్వారా లీగల్ నోటీసులను పంపించారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజా జీవితంలో ఉన్న తన పరువుకు భంగం కలిగించాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్, రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతుని కేటీఆర్ మండిపడ్డారు. ఎఖఅ సెక్షన్ 499, 500 నిబంధనల ప్రకారం పరువు నష్టం దావా నోటీసులు పంపించారు. వారం రోజులలోగా ఇద్దరూ తమ వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు ఖఖీ. లేదంటే 100 కోట్ల రూపాయల పరువు నష్టం దావాను ఎదుర్కోవాల్సి వస్తుందని నోటీసులో పేర్కొన్నారు. తనపై ఏయే సందర్భాల్లో ఎవరు ఏ ఆరోపణలు చేశారనే దానికి సంబంధించిన సాక్ష్యాలను కూడా నోటీసుల్లో ప్రస్తావించారు.

# రైతులకు 10 వేలు ఏం సరిపోతుంది

**నల్గొండ:**

రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10 వేలు ఇస్తా అంటే రైతులకు ఎలా సరిపోతుంది? అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్ అయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వడగళ్ల వాన తో రైతులు నష్టపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10 వేలు ఇస్తా అంటే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. రైతులను మేము కలిసామని, సమస్యలను తెలుసుకున్నామని తెలిపారు. రైతులకు రుణ మాఫీ చెయ్యలేదు, 50 వేలు మాత్రమే రైతులకు రుణ మాఫీ అయ్యిందని అన్నారు. కొన్ని చోట్ల 25 వేలు మాత్రమే మాఫీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు భువనగిరిలో 4 వేల దరఖాస్తులు, 2300 దరఖాస్తులు అనర్హులుగా తేల్చారు. దానిలో అర్హులు లేరా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అదనంగా పేదలకు 2000 ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.భువనగిరి లో 430 ఇళ్లు మాత్రమే ఉన్నాయని, ఆలేరు లో డబుల్ బెడ్ రూం ఇళ్లు నీట మునిగాయని కోమటి రెడ్డి అన్నారు. ఉద్యోగుల విభజన లో భాగంగా ఉద్యోగులు కూడా ఆత్మహత్య లు చేసుకునే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.టీచర్ ఉద్యోగ నియామక నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 10 వేలు ఖాళీలు కాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగులతో ముడి పడి ఉన్న సమస్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ పై సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర హోమ్ మినిస్టర్ ని కలుస్తామన్నారు. టీఎస్‌పీఎస్‌సీ ఛైర్మెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పాస్ వర్డ్ లు మీ వద్దనే ఉండాలని ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడు రాహుల్ పై కోర్టు జడ్జిమెంట్ ఇచ్చి 2 ఏళ్లు శిక్ష విధించిందని, పై కోర్టులు ఉన్నా అనర్హత వేటు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం ఐక్యత కోసం తన కుటుంబంలో వ్యక్తులను కొల్పయాడని, ప్రజలందరూ రాహుల్ గాంధీకి సంఘీభావం తెలపాలన్నారు. రాహుల్ పై తీసుకున్న నిర్ణయం పై దేశం మొత్తం ఆశ్చర్య వ్యక్తం చేసింది.

# ఇంకా ఎమ్మెల్సీ క్రాస్ ఓటింగ్ రచ్చ

**కర్నూలు:**

ఇటీవల ఏపీ రాజకీయాల్లో కీలకంగా మారిన ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. ఆ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కోసం తనకు కూడా ఆఫర్ అందినట్లుగా నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ వ్యతిరేక ఓటు వేస్తే కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారని ఆయన తెలిపారు. దీనికి సంబంధించి తన కుమారునికి ఫోన్ చేశారని వెల్లడించారు. అయితే, తన తండ్రి అందుకు ఒప్పుకోదని తన కుమారుడు తిరసకతెలిపారు. ఇది ఇంతటితో ఆగలేదన్నారు.వైఎస్ఆర్ సీపీకి సన్నిహితంగా ఉంటున్న జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ రావు మూడు రోజుల క్రితం తొలుత ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేయాలని తనకే మొదటి ఆఫర్ వచ్చిందని తెలిపారు. క్రాస్ ఓటింగ్ చేస్తే తనకు ఏకంగా రూ.10 కోట్లు ఇస్తామన్నారని చెప్పారు. తనకంటే ముందు మరో ఇద్దరు ఎమ్మెల్యేలకు వచ్చిందని ఆరోపణ చేశారు. క్రాస్ ఓటింగ్ చేస్తే టీడీపీలో మంచి పొజిషన్ ఇస్తానని అన్నారని చెప్పారు. తన దగ్గర డబ్బు లేదని, అలాంటి పరిస్థితుల్లో తాను సైలెంట్‌గా క్రాస్ ఓట్ చేసి డబ్బు తీసుకొని ఉండొచ్చని అన్నారు. కానీ, పరువు పోతుందని తాను ఆ పని చేయలేదని మాట్లాడారు. రాజోలు నియోజకవర్గంలోని ఓ సభలో మాట్లాడుతూ రాపాక ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో బాగా వైరల్ అయింది.ఈ వీడియో గురించి రాపాక వరప్రసాద్ ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. తన వద్దకు ఈ ఆఫర్ ను ఉండి ఎమ్మెల్యే శివరామరాజు తీసుకొచ్చారని చెప్పారు. రూ.10 కోట్ల ఆఫర్ నేరుగా ఇవ్వలేదని, క్రాస్ ఓటింగ్‌లో అసలు డబ్బుల ప్రస్తావనే రాలేదని వివరణ ఇచ్చారు. మరి పది కోట్లు వస్తుందని స్వయంగా అన్నారు కదా అని ప్రశ్నించగా, అదేదో తాను సుమారుగా చెప్పానని అన్నారు. ఈ విషయాన్ని తాను ఎక్కడా చర్చించలేదని, మీడియాకు కూడా చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. రాజోలులో జరిగిన ఓ ప్రైవేటు మీటింగ్ లో వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలతో తాను ఈ విషయాన్ని పంచుకున్నానని అన్నారు. దీన్ని ఎవరో వీడియో తీసి వైరల్ చేశారని చెప్పారు.తాను ఏనాడూ రాపాక వరప్రసాద్ కు ఏ ఆఫర్ గానీ, డబ్బుల ఆఫర్ గానీ చేయలేదని ఉండి ఎమ్మెల్యే రామరాజు స్పష్టత ఇచ్చారు. రాపాక వీడియో వైరల్ అయిన అనంతరం కాసేపటికి ఎమ్మెల్యే రామరాజు స్పందించారు. టీడీపీకి ఉన్న 23 మంది ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు వేయకపోయినా వైఎస్ఆర్ సీపీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై అసంతృప్తితో టీడీపీకి ఓటు వేస్తారని భావించామని అన్నారు. తాము అనుకున్నట్లుగానే టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేశారని చెప్పారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, తానూ ఎప్పుడూ స్నేహపూర్వకంగానే మాట్లాడుకుంటామని, అసెంబ్లీ లాబీలో అప్పుడప్పుడు మాట్లాడుకుంటామని చెప్పారు. అయితే, ఆయన్ను తాను ఎప్పుడూ వ్యక్తిగతంగా కలవలేదని ఉండి ఎమ్మెల్యే రామరాజు స్పష్టం చేశారు.

# జూలై నుంచి మెడికల్ కాలేజీలు

**హైదరాబాద్:**



తెలంగాణలో కొత్తగా మంజూరైన మెడికల్ కాలేజీల్లో జులై నాటికి తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్ రావు ఆదేశించారు. రాష్ట్రంలో 9 కొత్త వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో స్థానికంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుని పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు.కొత్త వైద్య కళాశాలల్లో పనుల పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు వేగంగా జరిగేందుకు సంబంధిత జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, చొరవ చూపాలన్నారు. కళాశాలకు అవసరమైన ఫర్నిచర్, పరికరాలను సమకూర్చుకోవాలని, అన్ని సదుపాయాలతో కూడిన వసతిగృహాలు సిద్ధం చేయాలని సూచించారు.తెలంగాణ వైద్యవిద్య విప్లవం దిశగా అడుగులు వేస్తోందని, వైద్యవిద్యకు హబ్‌గా మారుతోందని హరీశ్‌రావు అన్నారు. మారుమూల జిల్లాల్లో సైతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వైద్యకళాశాలలు ఏర్పాటు చేస్తున్న ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని ఆయన అన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, ఒక నర్సింగ్ కాలేజీ విధానం ప్రకటించి దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. రాష్ట్రంలో తొమ్మిది కొత్త వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన అత్యంత కీలకంగా మారనుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు వీలుగా కళాశాలలను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయాలనే ప్రభుత్వ ఆలోచనలకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా తొమ్మిది వైద్య కళాశాలను ప్రారంభించడం ద్వారా 900 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కరీంనగర్, ఖమ్మం, వికారాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, జనగాం, సిరిసిల్ల, నిర్మల్, ఆసిఫాబాద్‌లలో కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించాలంటే జాతీయ వైద్యమండలి (ఎన్ఎంసీ) అనుమతించాల్సి ఉంది. ఇప్పటికే రెండుసార్లు తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు బోధన సిబ్బంది నియామకం, వసతులపై అసంతృప్తి వ్యక్తంచేశాయి. మొదటిసారి పరిశీలించినప్పటి పరిస్థితులే తాజాగా వచ్చినప్పుడూ ఉన్నాయని రెండోసారి తనిఖీల సందర్భంగా గుర్తుచేశాయి. దాంతో ఈ అంశంపై వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2815 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. కొత్త కళాశాలలు ప్రారంభమైతే మరో 900 సీట్లు అందుబాటులోకి వస్తాయి. మొత్తం సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ మూడోసారి కొత్త వైద్య కళాశాలల తనిఖీకి వచ్చేలోపు బోధనా సిబ్బంది నియామకం, వసతుల కల్పన సహా కీలక అంశాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 24 ప్రైవేటు వైద్య కళాశాలలు ఉండగా వాటిలో 3,800 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.తొమ్మిది వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బందిని నియమించనున్నారు. ఇందులో భాగంగా 87 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి ఇచ్చారు. అలాగే 210 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించే అంశంపైనా దృష్టి సారించారు. 1,442 మంది అసోసియేట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియనూ కొలిక్కి తెచ్చారు. అయితే... మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం జరుగుతుండటంతో మంత్రి సూచనతో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపుతున్నారు. ఇప్పటికే నీట్ ఎంబీబీఎస్ ప్రకటన వెలువడింది. అడ్మిషన్ల ప్రక్రియ దశకు రావడానికి ఇంకా నాలుగైదు నెలల సమయం ఉండటంతో అంతలోపు కొత్త వైద్య కళాశాల ప్రారంభానికి అవసరమైన ప్రక్రియను పూర్తి చేసేందుకు అవకాశముందని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు.

## 10 రోజుల్లో 50 వేల బుకింగ్స్

**హైదరాబాద్**

టీఎస్ఆర్ టీసీ ప్రయాణికులను ఆకర్షించేందుకు వినూత్నంగా ముందుకు దూసుకుపోవడంతోపాటు మరో అడుగు ముందుకేసి ఇప్పుడు రాములోరి భక్తులను ఆకట్టుకునేందుకు చేసిన ప్రయత్నం సత్ఫలితాలిస్తోంది. శ్రీరామనవమి నేపథ్యంలో మీ ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు అంటూ తెలంగాణా రోడ్డు రవాణా సంస్థ చేపట్టిన కళ్యాణ తలంబ్రాలకు అపూర్వ స్పందన లభిస్తోంది. శ్రీరామ నవమి అంటే తెలుగు రాష్ట్రాల్లో వెంటనే గుర్తొచ్చేది భద్రాద్రి. రాష్ట్ర విభజన తరువాత కూడా భద్రాద్రి సీతారాములు కళ్యాణ మహోత్సవాలకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. నేరుగా కళ్యాణ మహోత్సవంతో పాల్గొనలేని వాళ్లు కనీసం స్వామివారి తలబ్రాలు అందుకున్నా చాలనే ఆశతో ఉంటారు. అటువంటి భక్తుల సంకల్పాన్ని నెరవేర్చేందుకు కళ్యాణ తలంబ్రాలంటూ వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది టీఎస్ఆర్టీసీ.అయితే ఊహించిన దానికంటే ఎక్కువగా భక్తులను నుండి స్పందన లభిస్తోంది. కేవలం పది రోజుల్లోనే 50 వేల మంది భక్తులు ఈ కళ్యాణ తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకున్నారు. రోజుకు సగటున 5 వేల వరకు బుకింగ్‌లు అవుతున్నాయి. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చేసిన ప్రయత్నం విజయవంతం అయ్యింది. రూ.116 చెల్లించి బుక్ చేసుకుంటే కల్యాణం అనంతరం తలంబ్రాలను భక్తులకు హోం డెలివరీ చేయనుంది ఆర్టీసీ. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తలంబ్రాల బుకింగ్ జరుగుతోంది.ఆర్టీసీ ఉన్నతాధికారులు ఊహించిదానికంటే భారీగా భక్తుల నుండి స్పందన రావడంతో మరో అడుగు ముందుకేసిన టీఎస్ ఆర్టీసీ భక్తులకు మరో అవకాశాన్ని కల్పించింది. శ్రీరామ నవమి కల్యాణ సమయంలోనే కాకుండా.. తలంబ్రాలను ఎప్పుడైనా భక్తులు పొందే సదవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్గో పార్శిల్ సెంటర్‌కు వెళ్లి రూ.116 చెల్లిస్తే నిర్ణీత సమయంలో తలంబ్రాలను భక్తులకు అందించనుంది. "భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణతలంబ్రాల కోసం ఒక్క తెలంగాణ నుంచే కాకుండా విదేశాల నుండి బుకింగ్స్ వస్తున్నాయి. దుబాయ్, అమెరికా వంటి దేశాల నుండి సైతం కాల్ చేసి తలంబ్రాలు కావాలని అడుగుతున్నారంటే ఆర్టీసీ ప్రయత్నం ఏ స్థాయిలో ఫలితాలిస్తుందో అర్థం చేసుకోవచ్చు. కేవలం 10 రోజుల్లోనే 50 వేల బుకింగ్‌లు వచ్చాయి. నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా చేసి భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఉపయోగిస్తారు. విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తులు పొందేందుకు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు టీఎస్ఆర్టీసీ ఛైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్.రాష్ట్రంలోని అన్ని టీఎస్ఆర్టీసీ కార్గో పార్శిల్ కౌంటర్లలో తలంబ్రాలను బుక్ చేసుకోవచ్చని ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు. ఈ సేవలను పొందాలనుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగ ఫోన్ నంబర్లు 9177683134, 7382924900, 9154680020ను సంప్రదించవచ్చని అంటున్నారు. తమ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు భక్తుల వద్ద కూడా ఆర్డర్‌ను స్వీకరిస్తారని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు.

## నూతన బస్ స్టాండ్ కు భూమి పూజ చేసిన మంత్రి హరీష్ రావు

**సిద్ధిపేట**



ఎన్నో ఏళ్లుగా బస్టాండ్ కోసం ధర్నాలు రాస్తారోకోలు చేసిన ప్రజ్ఞాపూర్ ప్రజల కష్టం, కల తీరబోతున్నదనీ మంత్రి హరీష్ రావు అన్నారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞ్యపుర్ రాజీవ్ రహదారి వద్ద నూతన బస్టాండ్ నిర్మాణానికి సుమారు 6కోట్ల 37 లక్షల నిధులతో భూమి పూజ చేసారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలకు ప్రజా రవాణా వ్యవస్థ మరింత చేరువ కాబోతుందని రాష్ట్ర మంత్రి హరీశ్ రావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ ఛైర్పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రతాపరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు షాకిచ్చిన ఎయిర్ ఇండియా

**విజయవాడ**

కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయంలో కువైట్ వెళ్ళే ప్రయాణికులకు ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ విమాన సంస్థ షాక్ ఇచ్చింది. కువైట్ వెళ్లెందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికులకు కువైట్ విమానం వెళ్లిపోయిందని ఎయిర్ ఇండియా అధికారులు సమాధానం చెప్పడంతో ప్రయాణికులు ఖంగుతిన్నారు.మూడు రోజులు క్రితం బుక్ చేసుకున్న తమకు 29వ తేదీ మధ్యాహ్నం1.10 నిమిషాలకు టికెట్ ఇచ్చి 11 గంటలకు బోర్డింగ్ పాస్ కోసం వస్తే 9.50కే విమానం వెళ్లిపోయిందని చెప్పడంతో 18మంది ప్రయాణికులు ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ బుకింగ్ కౌంటర్ వద్ద ఆందోళనకు దిగారు.ఈసందర్భంగా పలువురు ప్రయాణికులు మాట్లాడుతూ 1.10కి గన్నవరం నుండి కువైట్ కు వెళ్లాల్సిన విమానం 9.50కి వెళ్ళితే కనీసం సమాచారం కూడా ఇవ్వకపోగా సరైన సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటెలిజెన్స్ అట్టర్ ఫ్లాప్ అయిందా...

**నెల్లూరు :**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్సీ అధికార వైసీపీ ఓటమి వెనక చాలా తంతంగం జరిగిందంటున్నారు. జగన్ కూడా దీనిపై సీరియస్ గానే ఉన్నారని తెలిసింది. బాధ్యులైన వారిని గుర్తించిన నేతలు వారి పేర్లను కూడా జగన్ కు వివరించినట్లు చెబుతున్నారు. అయితే చర్యలు ఎప్పుడు తీసుకుంటారన్నది ఇంకా తేలకున్నా వారికి సరైన సమయంలో గుణపాఠం చెప్పేందుకు జగన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ కేంద్రంగానే ఈ కుట్ర జరిగినట్లు వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరులో వైసీపీ ఎమ్మెల్యేలతో టీడీపీ ముఖ్యులు మంతనాలు జరిపినట్లు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వంలో తొలి నుంచి ఇంటలిజెన్స్ శాఖ పెద్దగా పనిచేయడం లేదన్న విమర్శలున్నాయి. ఆ శాఖకు చీఫ్ గా స్టీఫెన్ రవీంద్రను తేవాలని జగన్ తొలుత భావించినా అందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతమున్న సీతారామాంజనేయు?లు కూడా ఆషామాషీ అధికారి కాదు. ఆయనకు ఇలాంటి విషయాలను పసిగట్టడంలో కొట్టిన పిండి. రాష్ట్రంలో ఏమాత్రం చడీ చప్పుడు లేకుండా తంతు అంతా పొరుగు రాష్ట్రాల్లో ముగిసేలా చంద్రబాబు ప్లాన్ చేశారు. తాను ఉండవల్లిలోనే ఉంటే ఇంటలిజెన్స్ అధికారులు అటు వైపు చూడరని తెలుసు. ఆ నేపథ్యంలోనే తనకు నమ్మకమైన పారిశ్రామికవేత్తలను, నేతలను పంపి పనిని చక్కబెట్టినట్లు వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని తెలిసింది. ఇంటలిజెన్స్ వ్యవస్థ ఫెయిలయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం ఒక అభ్యర్థికి ఇరవై రెండు మంది ఎమ్మెల్యేలను కేటాయించారు. ఆ ఇరవై రెండు మందికి కోడ్స్ ఇచ్చారు. కోడ్స్ ప్రకారం ప్రాధాన్యత క్రమంలో వారు ఓటు చేయాల్సి ఉంది. ఆ 22 మంది ఎమ్మెల్యేలకు ఒక మంత్రిని ఇన్ ఛార్జిగా ఉంచారు. అసంతృప్తిగా ఉన్న వైసీపీ నేతలను గుర్తించి జగన్ స్వయంగా పిలిపించి మాట్లాడారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ముందుగానే బేరసారాలు జరిగిపోవడంతో జగన్ వద్ద తలూపిన నేతలు ఎన్నికల సమయానికి టీడీపీకి వైపు మరలారన్నది వైసీపీ నేతల విశ్లేషణల్లో వెల్లడయింది. కోడ్ ప్రకారం చూసి ఆ నేతలను గుర్తించి జగన్ కు నివేదిక నేతలు అందించారు. పోటీకి నిలబెట్టారంటే చంద్రబాబు వ్యూహం ఉంటుందని ముందుగానే తెలిసినా, ఆయన ఇక్కడే ఉండటంతో ఎవరూ పసిగట్టలేకపోయారన్నది వైసీపీ నేతల భావన. చివరకు ఫలితం వచ్చిన తర్వాత కానీ అసలు విషయం తెలియరాలేదు. హైదరాబాద్, బెంగళూరుల్లో జరుగుతున్న బేరసారాలను పసిగట్ట లేకపోయారని జగన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై అధికారులపై కూడా వేటు వేసే అవకాశముందని చెబుతున్నారు. అలాగే పార్టీ ఓటమికి కారణమయిన ఇద్దరిపైనా తగిన సమయంలో చర్యలు తీసుకుంటామని సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికే చెప్పారు. అయితే చర్యలకు దిగకుండా వారిపై ఎలా రివెంజ్ తీసుకోవాలన్నది కూడా తమ అధినేత ఆలోచిస్తే బాగుండునని వైసీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

# కమిషనర్ ఆఫీసు నుంచే లీకులు

**హైదరాబాద్:**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రధాన నిందితులైన ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఢాక్యానాయక్, రాజేందర్‌ను మార్చి 26న మూడురోజుల కస్టడీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వీరిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే 'గ్రూప్–1' ప్రిలిమ్స్‌తోపాటు పలు పేపర్ల లీకేజీకి పాల్పడిన వీరు 'గ్రూప్–1' మెయిన్స్ పేపర్ లీకేజీకి కూడా ప్లాన్ చేసినట్లు సిట్ విచారణలో వెల్లడైంది. గ్రూప్–1లో 100కు పైగా మార్కులు సాధించిన 121 మంది యువతీ, యువకుల్లో ఇప్పటివరకూ 60 మందిని విచారించారు. న్యూజిలాండ్‌లో ఉన్న రాజశేఖర్ రెడ్డి బావ ప్రశాంత్‌కు సోమవారం సిట్ పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాన్ని లీక్ చేసి సక్సెస్ అయిన ప్రవీణ్, రాజశేఖర్ ఏఈ ప్రశ్నపత్రం ద్వారా బాగా డబ్బులు సంపాదించాలని స్కెచ్ వేశారు. ఏఈ ప్రశ్నపత్రాన్ని రేణుకకు అప్పగించి రూ.10 లక్షలు తీసుకున్నారు. 'మేము గ్రూప్స్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ప్రిలిమ్స్ లీక్ చేసి సక్సెస్ అయ్యాం. మెయిన్స్‌పై కూడా ఎంతో నమ్మకం ఉంది. ఆ పేపర్‌ను కూడా సంపాదిస్తాం. మాతోపాటు మా వాళ్లు గ్రూప్స్ కొడితే ఉన్నత పదవుల్లో ఉంటారు. మెయిన్స్ రాయాల్సి ఉన్నదనే విషయం గుర్తించుకో. ఎవరికైనా తెలిస్తే అందరం దొరికిపోతాం. ఉన్న ఉద్యోగాలు ఊడుతాయ్..' అని రేణుకకు జాగ్రత్తలు చెప్పినట్టు తెలిసింది. ఆమె ప్రవీణ్, రాజశేఖర్‌కు ఇచ్చిన మాట ప్రకారం నీలేశ్, గోపాల్‌కు పేపర్‌ను విక్రయించి, వారిద్దరిని మహబూబ్‌నగర్‌లో పరీక్షకు సిద్ధంచేసి పరీక్ష హాల్‌కు తీసుకొచ్చింది.టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ పోలీసులకు కీలక ఆధారం లభించింది. రెండోసారి పోలీసు కస్టడీలోకి తీసుకొన్న ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, డాక్యానాయక్, రాజేంద్రనాయక్‌ల నుంచి సోమవారం కీలక వివరాలు రాబట్టినట్టు సమాచారం. కాన్ఫిడెన్షియల్ విభాగం సూపరింటెండెంట్ శంకరలక్ష్మి డైరీ నుంచి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వివరాలు సేకరించినట్లు తాజాగా నిర్ధారణకు వచ్చారు. ఆమె డైరీ నుంచి పాస్‌వర్డ్ కొట్టేసి గతేడాది అక్టోబరు 1న ఆమె కంప్యూటర్‌లోని ప్రశ్నపత్రాలను పెన్‌డ్రైవ్‌లోకి కాపీ చేసినట్టు రాజశేఖర్ రెడ్డి అంగీకరించినట్టు సమాచారం. కొన్ని ప్రశ్నపత్రాలను ప్రవీణ్‌కుమార్ పెన్‌డ్రైవ్‌లోకి మార్చినట్టు వెల్లడించినట్టు తెలుస్తోంది. మరోవైపు, బడంగ్ పేట్‌లోని ప్రవీణ్ కుమార్ నివాసంలో తనిఖీ చేసిన సిట్ పోలీసులు రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.ఏఈ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలో మార్చి 27న మరో వ్యక్తిని సిట్ అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు చేసినవారి సంఖ్య 15కు చేరింది. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సల్కర్ పేట గ్రామానికి చెందిన తిరుపతయ్య ఉపాధి హామీ పథకం పర్యవేక్షకుడిగా పనిచేస్తున్నాడు. ఒకే మండలం, విభాగంలో పనిచేస్తున్న డాక్యానాయక్‌తో అతనికి పాత పరిచయాలున్నాయి. తన వద్ద ఏఈ ప్రశ్నపత్రం ఉందని తిరుపతయ్యకు డాక్యానాయక్ చెప్పాడు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం నేరెళ్లపల్లికి చెందిన రాజేందర్ కుమార్‌తో రూ.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని రూ.5 లక్షలు తీసుకొని ప్రశ్నపత్రం చేతికిచ్చేందుకు తిరుపతయ్య దళారీగా వ్యవహరించాడని నిర్ధారణ కావటంతో అరెస్ట్ చేశారు. బడంగ్‌పేట్, మల్లికార్జున కాలనీలో ఉన్న ప్రవీణ్‌కుమార్ ఇంట్లో మార్చి 27న సిట్ అధికారులు సోదాలు చేయగా.. రూ.4 లక్షల నగదు లభించింది. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో వంద మార్కులు దాటిన 121 మందిని సిట్ గుర్తించి 60 మందిని విచారించింది.పేపర్ లీకేజీ ఘటనపై సిట్ అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు జరుగుతోంది. రెండోసారి కస్టడీలోకి తీసుకున్న నిందితుల విచారణ మంగళవారం (మార్చి 28) ముగియనుంది. లీకైన ప్రశ్నపత్రంతో గ్రూప్–1 పరీక్ష రాసి, అరెస్టయిన సురేశ్, రమేశ్, షమీమ్‌ను కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ న్యాయస్థానాన్ని కోరింది. దీనిపై మంగళవారం తీర్పు వెలువడే అవకాశాలున్నాయి. ఏఈ ప్రశ్నపత్రం లీకేజీలో అరెస్టయి న ప్రశాంత్, రాజేందర్, తిరుపతయ్యనూ కస్టడీలోకి తీసుకోనున్నారు. నిందితులు, పరీక్ష రాసిన వారికి ఉన్న సంబంధాలను గుర్తించడానికి కాంటాక్టులు మ్యాపింగ్‌చేస్తూ ఆయా లింక్‌లను వెలుగులోకి తెస్తున్నారు.టీఎస్‌పీఎస్సీ 'గ్రూప్–1' ప్రిలిమినరీ పరీక్ష పేపర్లు వాట్సాప్ ద్వారానే చేతులు మారినట్టు దర్యాప్తు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ కేసులో నిందితులు పకడ్బందీగా ప్రశ్నపత్రాలను పంచుకొని లాభపడే ప్రయత్నం చేశారని అధికారులు గుర్తించారు. టీఎస్‌పీఎస్సీ కమిషన్ కార్యాలయం కేంద్రంగానే మొత్తం వ్యవహారం కొనసాగించినట్లు అంచనాకు వచ్చారు. ఈ కేసులో తాజాగా అరెస్టయిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ షమీమ్, నలగొప్పుల సురేశ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ దామెర రమేష్ కుమార్ రిమాండ్ రిపోర్టులో ఈమేరకు పలు అంశాలను అధికారులు ప్రస్తావించారు. మార్చి 22న దర్యాప్తు అధికారులు, ఈ ముగ్గురి నివాసాల్లో తనిఖీలు నిర్వహించి ఒక ల్యాప్‌టాప్, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారికి వాట్సాప్ ద్వారానే ప్రశ్నపత్రాలు చేరినట్టు మొబైల్ ఫోన్ల విశ్లేషణ ద్వారా నిర్ధారణకు వచ్చారు. ఇక ఈ కేసులో ఏ–12 రమేష్ కుమార్ ఇంట్లో లభించిన ల్యాప్‌టాప్ నుంచి కీలక సమాచారం సేకరించారుటీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారం రోజుకోమలుపు తిరుగుతోంది. తీగలాగితే డొంకంతా కదిలినట్లు.. కొత్త పాత్రధారులు పుట్లుకొస్తున్నారు. ఇప్పుడు ఏకంగా గ్రూప్–1 పేపర్ దేశం దాటినట్లుగా దర్యాప్తు అధికారులు ?గుర్తించారు. పేపర్ లీకేజీలో ప్రధాన నిందితుడు రాజశేఖర్‌రెడ్డి.. న్యూజిలాండ్?లో ఉంటున్న అతడి బావ ప్రశాంత్‌రెడ్డికి వాట్సాప్‌లో పేపర్?షేర్ చేసినట్లు విచారణలో తేల్చింది. దీంతో అతడికి నోటీసులు జారీ చేసింది. ప్రశాంత్‌రెడ్డి పరీక్ష రాసి తిరిగి న్యూజిలాండ్ వెళ్లిపోవడంతో వాట్సాప్, మెయిల్ ద్వారా సమాచారం అందించింది. ఐతే సిట్ నోటీసులకు ప్రశాంత్ రెడ్డి నుంచి ఎలాంటి స్పందన రాలేదని తెలిసింది. దీంతో లుకౌట్ నోటీసులు ఇష్యూ చేసేందుకు సిట్ అధికారులు చర్యలు ప్రారంభించారు

# కాంగ్రెస్ లో గులాబీ ప్రకంపనలు

**హైదరాబాద్:**

ఎన్నికలు సమీపిస్తోన్న వేళ కాంగ్రెస్?పార్టీలో కొత్త కన్ ఫ్యూజన్ నెలకొంది. గులాబీ మిత్రపక్షమో...ప్రత్యర్థో తెలియక చాలామంది కాంగ్రెస్?లీడర్లు సీఎం కేసీఆర్ మీద విమర్శలు చేయడం బంద్ పెట్టడం గమనార్హం.మోడీ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షాలంతా ఏకం కావాలంటూ కేసీఆర్ ప్రయత్నాలు మొదలు పెట్టారు. బీఆర్ఎస్ పార్టీ పేరుతో దేశవ్యాప్తంగా విస్తరిస్తూనే మోడీ వ్యతిరేక శక్తులను ఏకం చేస్తున్నారు. అయితే, ఈ గ్రూప్‌లో కాంగ్రెస్‌ను జత చేయకపోతే ఇప్పుడున్న అంచనాల ప్రకారం రాబోయే ఎన్నికల్లోనూ బీజేపీని ఎదుర్కోవడం కష్టమని సీఎం కేసీఆర్‌కూ తెలుసు. దీంతో బీఆర్ఎస్?కాంగ్రెస్‌తో అలయెన్స్ పెట్టుకోవడం మేలని పలువురు రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు బీజేపీని వ్యతిరేకిస్తున్నట్లు బీఆర్ఎస్?తన యాక్టివిటీస్‌లో వేగం పెంచినా.. తన మద్దతు ఎవరికి ఉంటుందనేది ఇప్పటివరకు కేసీఆర్?క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఇటీవల రాహుల్?గాంధీపై ఎంపీగా అనర్హత వేటు వేయడాన్ని మాత్రం సీఎం కేసీఆర్?తప్పుబట్టారు. అంతేగాక 'కాంగ్రెస్‌తో కలవడం తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, పెత్తనం చూపించడానికి మాత్రమే అంగీకరించం' అంటూ ఎమ్మెల్సీ కవిత గతంలో చేసిన కామెంట్లు కాంగ్రెస్?పార్టీని డైలమాలో పడేశాయి. ముఖ్య లీడర్లతో పాటు కాంగ్రెస్?క్యాడర్?కూడా బీఆర్ఎస్ తమకు మద్దతు ఇస్తుందనే ఆశతో ఉన్నట్లు సమాచారం.దేశ వ్యాప్తంగా మోడీని ధీటుగా ఎదుర్కోవాలంటే బీఆర్ఎస్,?కాంగ్రెస్‌తో కలవాల్సిందేనని ఆ పార్టీ నేతలూ చెబుతున్నారు. మోడీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న కేసీఆర్.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌తో కలిచే ఛాన్స్?ఉన్నదంటూ పొలిటికల్?వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. దీంతోనే రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్?చేస్తున్న దీక్షల్లో సీఎం కేసీఆర్‌పై నేతలెవ్వరూ విమర్శలు చేయడం లేదనేది చర్చ. పైగా హైదరాబాద్?పర్యటనకు వచ్చిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్?చవాన్?కూడా కేసీఆర్?మహారాష్ట్ర ఎంట్రీని స్వాగతిస్తున్నామని నొక్కి చెప్పారు. అయితే ఆయన ఎటువైపు ఉంటారనేది? ఇప్పటి వరకు స్పష్టతను ఇవ్వలేదన్నారు. . అయితే, గతకొన్ని రోజుల నుంచి సీఎం కేసీఆర్?వ్యవహరిస్తున్న విధానాలు కూడా కాంగ్రెస్?పార్టీకి సన్నిహితంగా ఉన్నట్లు కనిపిస్తున్నది. ఈ పరిణామాలమన్నింటిని పరిగణలోకి తీసుకుంటున్న కాంగ్రెస్?నేతలు కేసీఆర్?సర్కార్‌పై మౌనంగా ముందుకు వెళ్లున్నారు. టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌తో ఒప్పందం కుదుర్చుకొని పలు ఎన్నికల్లోనూ పోటీ చేసింది. దీంతో గతంలో టీఆర్ఎస్‌తో పాటు అప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్‌కూ మేలు జరిగింది. ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను తట్టుకొని గెలవాలంటే కాంగ్రెస్ మద్దతు కూడా అవసరమే. మరోవైపు బీజేపీ కూడా తన యాక్టివిటీస్‌ను వేగం పెంచింది. రాష్ట్రంలో అధికారం కోసం పావులు కదుపుతున్నారు. కాంగ్రెస్?మద్దతు తీసుకుంటే, దేశ వ్యాప్తంగా బీఆర్ఎస్ విస్తరణకు మేలు జరుగుతుందని పలువురు రాజకీయ నేతలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్?కలిపేస్తామని గతంలో కేసీఆర్?హామీ ఇచ్చి మాట తప్పడం, కాంగ్రెస్?నేతల వలనే దేశం వెనకబడింది అని సీఎం హోదాలో అసెంబ్లీలోపదే పదే కామెంట్లు చేయడం వంటివి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ముఖ్య లీడర్లను ఆలోచింపజేస్తున్నది. కేసీఆర్?ఎప్పుడు ఎవరి వైపు ఉంటారనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంటుందని కాంగ్రెస్?పార్టీలోని ఓ కీలక నేత పేర్కొన్నారు. అయితే, ఏఐసీసీ తీసుకునే నిర్ణయాలను మాత్రం తు.చ తప్పక అమలు చేయాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.

# వరంగల్ లో సిట్టింగ్ రచ్చ....

**వరంగల్:**

ఓరుగల్లులో రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. గులాబీ దళపతి నిర్ణయం గుబులు రేపుతుంది. సిట్టింగ్ లకే సీట్లని సీఎం కేసీఆర్ ప్రకటించడం ఆశావాహులను ఆందోళనకు గురిచేస్తుందా? ఆశావాహులు ఎదురుతిరిగితే అధికార పార్టీకి ఎదురీత తప్పదా? అంటే అవుననే సమాధానం వస్తుంది. ఈ ఏడాదిలో జరగనున్న ఎన్నికలపై అప్పుడే చర్చ మొదలయ్యింది. భవిష్యత్తుకు బాటలు వేసుకునే పనిలో ఆశావాహులు నిమగ్నంకాగా, ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టేందుకు విపక్షాలు సిద్దమవుతున్నాయి. మారనున్న రాజకీయ సమీకరణాలపై పొలిటికల్ సర్కిల్ లో తీవ్ర చర్చ జరుగుతోంది.ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి. రాబోయే కాలానికి కాబోయే లీడర్ నేనేనని తిరిగే నాయకులకు దిమ్మతిరిగేలా షాక్ ఇచ్చారు గులాబీ దళపతి సీఎం కేసీఆర్. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్ లకే సీట్లని ఇటీవల జరిగిన పార్టీ సమావేశంలో ప్రకటించడం సిట్టింగ్ లకు కాస్త ఊరటనిచ్చినా, ఆశావాహులను మాత్రం ఆందోళనకు గురిచేస్తుంది. గులాబీ శ్రేణుల్లో గుబులుపుట్టిస్తుంది. సీఎం ప్రకటన బాగానే ఉన్నా, ఎప్పటి నుంచో టిక్కెట్ ఆశిస్తున్న వారి సంగతేంటన్న ప్రశ్న తలెత్తుతున్నాయి. ఇప్పుడు ఏ ఇద్దరు కలిసినా టిక్కెట్లపైన చర్చించుకుంటున్నారు. ఉద్యమకాలం నుంచి కేసీఆర్ కు వెన్నంటి ఉండి రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పలు మార్లు పోటీకి దూరమైన నేతలను ఆలోచనలో పడేసి ఆందోళనకు గురిచేస్తుందట. భవిష్యత్తు కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమవుతున్నారట.ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో ములుగు మినహా 11 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. పదకొండులో ఏడు చోట్ల గులాబీ పార్టీలో పోటీ తప్పని పరిస్థితి నెలకొంది. పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, నర్సంపేటలో మాత్రమే పోటీ లేదు. మిగతా అన్ని చోట్ల సిట్టింగ్ లకు పోటీగా ఎమ్మెల్సీలు, ఎంపీలు ఉద్యమనాయకులు మేమున్నామంటూ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పలు చోట్ల గతకొంతకాలం నుంచి రాజకీయంగా కత్తులు దూసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. అంతర్గతంగా ఉన్న విబేధాలు పలు మార్లు బయట పడ్డాయి కూడా. ఎత్తుకు పై ఎత్తులతో టిక్కెట్ సాధించుకునే పనిలో గులాబీ నేతలు ఉండగా సిట్టింగ్ లకే మళ్లీ అవకాశం ఇస్తామని కేసీఆర్ ప్రకటించడం ఆశావాహులకు మింగుడుపడడం లేదు.స్టేషన్ ఘనపూర్ లో సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఉండగా ఆయనకు పోటీగా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి లేదా ఆయన కూతురు కావ్య టిక్కెట్ ఆశిస్తున్నారు. రాజయ్య, కడియం మధ్య నువ్వానేనా అన్నట్లు రాజకీయాలు నడుస్తున్నాయి. సీఎం నిర్ణయం మళ్లీ ఇద్దరి మధ్య వివాదానికి ఆజ్యం పోసినట్లయిందని స్థానిక నాయకులు భావిస్తున్నారు. అటు వరంగల్ తూర్పులో సిట్టింగ్ ఎమ్మెల్యేగా నన్నపనేని నరేందర్ కొనసాగుతున్నారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాజ్యసభసభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మేయర్ గుండు సుధారాణి టికెట్ ఆశిస్తున్నారు. భూపాలపల్లిలో గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచి టిఆర్ఎస్ లో చేరిన గండ్ర వెంకటరమణారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే కాగ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి టికెట్ రేసులో ఉన్నారు. అటు డోర్నకల్ లో సీనియర్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఉండగా అక్కడి నుంచి మంత్రి సత్యవతి రాథోడ్ టికెట్ ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మహబూబాబాద్ లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా శంకర్ నాయక్ ఉండగా అక్కడ ఎంపీ కవిత టిక్కెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వారి మధ్య విబేధాలు బజారుకెక్కాయి. ఇక పరకాల నుంచి చల్లా ధర్మారెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా అక్కడి నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రైతువిమోచన కమిటీ చైర్మెన్ నాగుర్ల వెంకటేశ్వర్లు టిక్కెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. జనగాంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉండగా అక్కడి నుంచి అవకాశం వస్తే పోటీ చేసేందుకు ఎమ్మెల్సీ పోచంపల్లితోపాటు మరోనాయకుడు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం సీఎం కేసీఆర్ సిట్టింగ్ లకే సీట్లని ప్రకటించి కొండ సురేఖకు మొండి చేయి చూపించారు. వరంగల్ తూర్పు నుంచి నరేందర్ కు అవకాశం కల్పించారు. ఈసారి సైతం రెండు మూడు చోట్ల అభ్యర్థులను మార్చే అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. అదే నిజమైతే సిట్టింగ్ లో సైతం గుబులు లేకపోలేదు. ఆశావాహుల ఆశలు సన్నగిల్లడం లేదు. సందెట్లో సడేమియాలా విపక్షపార్టీలు అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ కాచుకుని కూర్చున్నాయి. టిక్కెట్ రాక ఆలకబూనేది ఎవరని ఆరా తీస్తు వారిపై ప్రత్యేక దృష్టి సారించే పనిలో నిమగ్నమయ్యాయి. ఆపరేషన్ ఆకర్ష్ కు పదును పెట్టి ఆశావాహులను తమ వైపు తిప్పుకునే వ్యూహ రచన చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో ఎన్నికల నాటికి గులాబీ గూటిలో ఉండేదెవరో ఊడిపోయే నేతలెవ్వరోనని జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. మరోవైపు సీఎం కేసీఆర్ పదేపదే సిట్టింగ్ లకు టికెట్లు ఇస్తామని చెబుతున్నా, అది ఎంత వరకు నిజమౌతుందోనని ఓరుగల్లు ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

# బండి వర్సెస్ వినోద్ కుమార్

**కరీంనగర్**

గతంలో అనేక మంది ప్రముఖులు గెలిచిన లోక్‌సభ స్థానం కరీంనగర్. సంచలన రాజకీయాలకు కేంద్రం. టీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన తర్వాత ఆ పార్టీ నుంచి తొలిసారి ఎంపీ అయ్యారు కేసీఆర్. 2009లో ఈ సీటు గులాబీ పార్టీ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్ చేతికి వచ్చింది. కానీ.. 2009లో వినోద్ ఓడిపోయారు. 2014లో మాత్రం 2 లక్షల పైచిలుకు ఓట్లతో ఆయన గెలిచారు. 2019 ఎన్నికల్లో వినోద్‌కు చేదు ఫలితం తప్పలేదు. ఇక్కడ బీజేపీ ఎంపీగా బండి సంజయ్ గెలిచారు. ఇక్కడో విచిత్రం ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గులాబీపార్టీనే గెలిచింది. కానీ.. తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితం అధికారపార్టీకి రాలేదు. ఆ ఎన్నికల్లో ఓడినా.. ప్రస్తుతం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్నారు వినోద్. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ వినోదే తిరిగి పోటీ చేస్తారని అధికారపార్టీలో చర్చ జరుగుతోంది. కొంతకాలంగా వేములవాడ లేదా కరీంనగర్ అసెంబ్లీకి ఆయన పోటీ చేయొచ్చని ప్రచారం జరిగినా.. పార్టీ పెద్దలు మాత్రం వినోద్‌ను లోక్‌సభకు పోటీ చేయించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.కొద్దిరోజులుగా కరీంనగర్ లోక్‌సభ పరిధిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతున్నాయి. ఈసారి ఎలాగైనా వినోద్‌ను గెలిపించాలని నాయకులు ప్రకటించడంతో క్లారిటీ వస్తున్నట్టు చెబుతున్నారు. సిరిసిల్ల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల చుట్టూనే ప్రస్తుతం చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లో తాను గెలిచిన సిరిసిల్లలో తప్ప మిగతా చోట్ల వినోద్‌కు మెజారిటీ రాలేదని.. ఈసారి ఆ తప్పు పునరావృతం చేయకుండా ఎంపీగా గెలిపించాలని కోరారు కేటీఆర్. ఇదే సభలో పాల్గొన్న వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ మరో అడుగు ముందుకేశారు. ఈసారి మా బావను ఎంపీగా చూడాలని ఆకాంక్షిస్తున్నట్టు రమేష్ చెప్పారు. వేములవాడలో పార్టీ నుంచి తనకు ఇంకెవరూ పోటీ లేకుండా ముందుగానే కర్చీఫ్ వేసేశారు రమేష్. అయితే ఆయన పౌరసత్వంపై వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో రమేష్‌కు సీటు ఇస్తారో లేదో అనే చర్చ కొన్నాళ్లుగా పార్టీ వర్గాల్లో ఉంది. అలాంటిది వినోద్‌ను అడ్డంపెట్టుకుని రమేష్ తన మనసులో మాటను బయటపెట్టేశారు.ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో క్లారిటీ రాలేదు. మరి.. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి కరీంనగర్ నుంచి బరిలో ఉంటే.. వినోద్.. సంజయ్ కాంబినేషన్‌లో బిగ్‌ఫైట్ తప్పదనే వాదన నెలకొంది. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను రిపీట్ కానివ్వకుండా.. పక్కా రణతంత్రంతో వినోద్‌ను ఎంపీగా గెలిపించాలనేది గులాబీ నేతల ఆలోచన. అందులో భాగంగానే వినోద్ అభ్యర్థిత్వంపై ముందుగానే స్పష్టత ఇస్తున్నారని భావిస్తున్నారు. దీంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతలు అప్రమత్తం కావడంతోపాటు.. ఎన్నికల వ్యూహరచనకు సమయం చిక్కుతుందని లెక్కలేస్తున్నారు నాయకులు.

# సంబరాలతో సేవ చేస్తున్న నాట్స్ అల్లు అరవింద్



సరిగ్గా వందేళ్ల క్రితం తెలుగు వారందరూ సగర్వంగా ఇతను మావాడు అని చెప్పుకునే ముగ్గురు తెలుగు సినిమా మహనీయులు జన్మించారు. ప్రముఖ గాయకుడు ఘంటసాల, నవ్వుల రాజు అల్లు రామలింగయ్య, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావుల శతజయంతి ఉత్సవాలను మే 26, 27, 28 తేదిల్లో న్యూజెర్సీలో ఎంతో ఘనంగా చేయటానికి రంగం సిద్ధం చేసుకుంది నాట్స్ ( ఉత్తర అమెరికా తెలుగు సమితి). వారెంతో ప్రేమతో నిర్వహిస్తున్న ఈ వేడుకల గురించి సవివరంగా తెలియపర చటానికి హైదరాబాద్‌లోని పార్క్‌హయాత్ హోటల్లో ప్రెస్‌మీట్ పెట్టి మీడియాతో ముచ్చటించారు నాట్స్ ప్రెసిడెంట్ బాపు నూతి, కన్వీనర్ శ్రీధర్ అప్పసాని, డిప్యూడి కన్వీనర్ రాజ్ అల్లాడలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, సహజనటి జయసుధ, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, నటులు సాయికుమార్, అలీ, ఆది సాయికుమార్‌లతో పాటు అవసరాల శ్రీనివాస్ దర్శకులు ఎ.కోదండరామి రెడ్డి, బి.గోపాల్, గోపిచంద్ మలినేని, సిరాశ్రీ, గాయకులు సింహ, దినకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్స్ అధ్యక్షుడు బాపు నూతి మాట్లాడుతూ?" అమెరికాలో ఉండి మన తెలుగువారి బాగోగులను దగ్గరుండి చూసుకుంటుంది నాట్స్. తెలుగు వారికి ఏ కష్టం వచ్చినా క్షణాల్లో వారికి పరిష్కారం చూపించటమే కాకుండా అక్కడున్న తెలుగు వారికి సామాజిక, ఆర్ధిక సంక్షేమాన్ని సమకూర్చి మేమున్నామన్న ధైర్యాన్ని భరోసాని గట్టిగా ఇచ్చే సంస్థే నాట్స్ అని సగర్వంగా చెప్తున్నాను. అలాగే ఈ ఏడాది ఉత్తరమెరికా తెలుగు సంబురాలులో భాగంగా మన తెలుగు పెద్దల శత జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవటానికి భారీఎత్తున ప్లాన్ చేసుకుని ఇండియాకి వచ్చాము. ఈ ఈవెంట్‌లో పాల్గొనటానికి తెలుగు సినిమా పరిశ్రమనుండి అతిరథ మహారధులు ఎంతో మంది అమెరికాకి వచ్చి న్యూజెర్సీలో జరిగే వేడుకల్లో పాల్గొంటున్నారని చెప్పటానికి ఎంతో ఆనందంగా ఉంది" అన్నారు. నాట్స్ కన్వీనర్ శ్రీధర్ అప్పసాని మాట్లాడుతూ?" ఈ ఏడాది మేము చేస్తున్న ఈ సంబురాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తెలుగు సినిమాకు ఎంతో గొప్ప సేవలందించిన ఆ ముగ్గురు మహనీయుల శతజయంతి ఉత్సవాలతోపాటు నటులుగా గోల్డెన్‌జూబ్లి అంటే 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న జయసుధ, సాయికుమార్‌లను మా వేదికపై సత్కరించి వేడుకలను ఘనంగా చేయాలని మేమందరం నిర్ణయించుకున్నాం. గతంలో అనేక కార్యక్రమాలు చేసినప్పటికి ఈ ఏడాది చేసే కార్యక్రమాలకు ఎంతో విశిష్టత చేకూరనుంది. ఆయన అమెరికాకి వస్తాను అని మాటిచ్చిన తర్వాత గోల్డెన్‌గ్లోబ్ అవార్డు, ఆస్కార్ అవార్డు వచ్చింది. అస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ గారిని సత్కరించే అవకాశం నాట్స్‌కి రావటం లాటరీ టికెట్ కొన్నవాడికి జాక్‌పాట్ తగిలితే ఎంత ఆనందంగా ఉంటుందో అంతే ఆనందంగా ఉంది. మేము చేసే ప్రతి కార్యక్రమం నుంచి ఎవరో ఒకరికి మేలు జరగే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నాం" అన్నారు. డిప్యూటీ కన్వీనర్ రాజ్ అల్లాడ మాట్లాడుతూ?" అమెరికాలోని తెలుగు వారికే కాదు, ఇండియాలోని తెలుగు వారికి కూడా మా సంస్థ ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. మా ఫండ్స్ నుండి దాదాపు 25 శాతం సొమ్మును సామాజిక సేవకోసం పలు స్వచ్చంధ సంస్థలకు కేటాయిస్తున్నాం. తెలుగువారు అమెరికాలో ఉన్నా ఇండియాలో ఉన్నా వారిని ఆదుకొని సాయం చేయటమే మా సంస్థ లక్ష్యం. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు యూత్‌ని ఎంకరేజ్ చేయటానికి సీ.ఎక్స్.ఓ ఫోరంను నిర్వహించి యంగ్‌టాలెంట్‌ను ప్రోత్సహిస్తున్నాం" అన్నారు . సాయికుమార్ మాట్లాడుతూ?" తెలుగు

# విశ్వక్ సేన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ చిత్రం



ఔయువ సంచలనం, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.21 గా ఒక చిత్రం రూపొందనుంది. ఖతీజీబతిటటప్ట్రజీ చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ,శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించనుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకట్, గోపి సహ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. ప్రతిభ గల దర్శకుడు కృష్ణ చైతన్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు.

కథానాయకుడిగా విశ్వక్ సేన్ కి ఇది 11వ చిత్రం. నేడు(మార్చి 29) విశ్వక్ సేన్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం 11 గంటల 16 నిమిషాలకు ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో విశేషంగా ఆకట్టుకుంటోంది. వీడియోలో రాత్రిపూట నిర్మానుష్య ప్రాంతం నుంచి సరుకుతో ఉన్న మూడు లారీలు బయల్దేరి పోర్టుకి వెళ్తుంటాయి. రాజమండ్రిలోని గోదావరి వంతెనను కూడా వీడియోలో చూపించారు. అలాగే ఒక పడవపై ఉన్న రేడియోను గమనించవచ్చు. "సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో.. బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది" అంటూ వీడియోను చాలా ఆస్తికరంగా రూపొందించారు. దీనిని బట్టి చూస్తే ఈ చిత్రం రాజమండ్రి పరిసర ప్రాంతాలలోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో రూపొందనున్న పీరియాడిక్ ఫిల్మ్ అనిపిస్తోంది. ఇక "మాస్ కా దాస్ 'బ్యాడ్' గా మారాడు" అంటూ సినిమాపై ఆసక్తిని పెంచారు. ఎంతో ఇంటెన్స్ తో రూపొందించిన ఈ వీడియోలో యువన్ శంకర్ రాజా నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల 'దాస్ కా ధమ్కీ'తో అలరించిన విశ్వక్ సేన్.. పవర్ ఫుల్ మాస్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రంతో మరో ఘన విజయాన్ని అందుకోవడం ఖాయమని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

ఈ జనరేషన్ మోస్ట్ ప్రామిసింగ్ హీరోలలో విశ్వక్ సేన్ ఒకరు. సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ అతి కొద్ది కాలంలోనే ప్రేక్షకులకు ఎంతగానో చేరువయ్యారు. ముఖ్యంగా యువతలో తిరుగులేని క్రేజ్ ను సొంతం చేసుకున్నారు. ఇప్పుడు అగ్ర నిర్మాణ సంస్థ సితార బ్యానర్ లో సినిమా చేసే అవకాశం దక్కించుకున్నారు. విశ్వక్ సేన్, సితార బ్యానర్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రకటనతోనే ఈ చిత్రం అందరి దృష్టిని ఆకర్షించింది. త్వరలోనే ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుంది. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

తారాగణం: విశ్వక్ సేన్

# మీటర్' మాస్ ఊహించినదాని కంటే ట్రిపుల్ వుంటుంది - హీరో కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. మేకర్స్ ఇప్పటివరకు రెండు పాటలు, టీజర్‌ను విడుదల చేశారు. మీటర్ ఔట్ అండ్ ఔట్ మాస్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని పాటలు, టీజర్ భరోసా ఇచ్చాయి. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ఈ రోజు విడుదలైంది. ఎవరినీ పట్టించుకోని, తన స్వంత రూల్స్ ప్రకారం జీవితాన్ని ఆస్వాదించే రెక్లెస్ పోలీసుగా కిరణ్ అబ్బవరం యాక్షన్-ప్యాక్డ్ ఎంట్రీతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. కిరణ్ తనను ఇష్టపడే అమ్మాయితో ప్రేమలో పడతాడు. అతను చాలా డేంజరస్, పవర్ ఫుల్ రాజకీయ నాయకుడితో గొడవ పడతాడు. బ్యాచ్‌లో టాపర్‌గా ఉన్న ఈ పోలీసు అధికారి తన తండ్రి ప్రేరణతో తన డ్యూటీని సీరియస్‌గా తీసుకుంటాడు.రమేష్ కడూరి కమర్షియల్ గా కమర్షియల్ వయబుల్ సబ్జెక్ట్‌ని ఎంచుకున్నారు. కిరణ్ అబ్బవరం పోలీసు పాత్రను చాలా యీజ్ తో చేశాడు. తనదైన నటనతో కావాల్సిన వినోదాన్ని అందిస్తుంది. అతుల్య రవి గ్లామ్ డాల్‌గా కనిపించింది. మిగతా నటీనటులు తమ పాత్రలను అద్భుతంగా పోషించారు.

విజువల్స్ గ్రాండ్‌గా అనిపించాయి, సినిమాటోగ్రాఫర్‌గా వెంకట్ సి దిలీప్ అద్భుతమైన వర్క్ చేశారు. సాయి కార్తీక్ తన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో విజువల్స్ ని మరో లెవల్ కి తీసుకెళ్లాడు. ప్రొడక్షన్ వాల్యూస్ ఉన్నతంగా వున్నాయి.ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. మీటర్ మీరు ఊహించినదాని కంటే మాస్ డబుల్ ట్రిపుల్ వుంటుంది. అసలు సిసలైన కమర్షియల్ ఎంటర్ టైనర్ మీటర్. నేను పరిశ్రమలోకి వచ్చింది ఐదేళ్ళు



అవుతుంది. మీ అందరి అభిమానంతో ఈ ఐదేళ్ళు అద్భుతంగా గడిచింది. ఈ సందర్భంగా ప్రేక్షకులకు, అభిమానులకు, దర్శక నిర్మాతలకు, సాంకేతిక నిపుణులకు, మీడియాకి.. అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఇప్పటివరకూ నేర్చుకున్న అనుభవాలతో మీకు మరిన్ని మంచి సినిమాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. సినిమా చేయడం కష్టం. అందులో మీటర్ లాంటి కమర్షియల్ సినిమా చేయడం ఇంకా కష్టం. 75 రోజుల పాటు రేయింబవళ్ళు కష్టపడి షూట్ చేశాం. భారీ ఫైట్స్, సెట్స్, నిర్మాణ విలువలతో ఇంత పెద్ద సినిమాని ఇంత తొందరగా పూర్తి చేశామంటే కారణం మా టెక్నిషియన్స్. నిర్మాత చెర్రీగారికి కృతజ్ఞతలు. మీటర్ నాకు చాలా స్పెషల్ మూవీ. ఎందుకు ఇంత ప్రత్యేకమో ఏప్రిల్ 7న అర్ధమౌతుంది. పాటలు టీజర్ ట్రైలర్ చూసిన వారంతా కిరణ్ కి చాలా పెద్ద సినిమా పడందని అంటున్నారు. వంద శాతం నాకు నమ్మకం వుంది. ఎన్ని అంచనాలతో థియేటర్ లోకి వచ్చినా ఆ అంచనాలని అందుకునేలా వుంటుంది. టీజర్ ట్రైలర్ ఎలా గ్యాప్ లేకుండా పరిగెత్తాయో సినిమా కూడా అదే మీటర్ లో పరిగెడుతుంది. ఇది మంచి కమర్షియల్ సినిమా. ఊపు ఉత్సాహం కలగలిపితే మీటర్. థియేటర్ లో మీటర్ చాలా గట్టిగా వుంటుంది" అన్నారు

నిర్మాత చెర్రీ మాట్లాడుతూ.. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్స్ లో ఇప్పటివరకూ కమర్షియల్ సినిమా చేయలేదు, కొంచెం ప్రయోగాత్మక చిత్రాలే చేశాను. రమేష్ ఈ కథ చెప్పినప్పుడు చాలా బలమైన సబ్జెక్ట్ అనిపించింది. మాస్ కమర్షియల్ స్టయిల్ లో వుంటుందని అర్ధమైయింది. రమేష్ చాలా అద్భుతంగా తెరకెక్కించారు. విజువల్స్ చూసినప్పుడు అసలు కొత్తదర్శకుడని అనిపించదు. అత్యుల రవి అద్భుతంగా చేసింది. చాలా గ్లామరస్ గా కనిపిస్తుంది. కిరణ్ ఫస్ట్ టైం ఇంత మాస్ కమర్షియల్ స్టయిలీష్ గా చూడబోతున్నారు. ఈ సినిమాతో ఆయన పెద్ద హీరో అవుతారు. సాయి కార్తిక్ కు ఈ సినిమా కమ్ బ్యాక్ సినిమా అవుతుంది. చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఈ సినిమాలో పని చేసిన అందరికీ కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో సపోర్ట్ చేసే మైత్రీ మూవీ మేకర్స్ కి కృతజ్ఞతలు" తెలిపారు.

# సరికొత్త మాస్ అండ్ యాక్షన్ అవతార్‌లో నందమూరి కళ్యాణ్ రామ్



డిఫరెంట్ మూవీస్, రోల్స్ చేస్తూ హీరోగా తనదైన వెర్సటాలిటీతో మెప్పిస్తోన్న స్టార్ నందమూరి కళ్యాణ్ రామ్. ఆయన లేటెస్ట్ మూవీ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై నవీన్ మేడారం దర్శకత్వంలో అభిషేక్ నామా ఈ పీరియాడిక్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ఫైనల్ స్టేజ్‌కు చేరుకుంది. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్‌ను చిత్రీకరిస్తున్నారు. 500 మందితో ఈ ఫైట్‌ను తెరకెక్కిస్తుండటం విశేషం. టాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ యాక్షన్ ఎపిసోడ్‌గా చెప్పుకునేలా దీన్ని ఫైట్ మాస్టర్ వెంకట్ ఆధ్వర్యంలో డిజైన్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత అభిషేక్ నామా మాట్లాడుతూ "మా బ్యానర్‌పై ఎంతో ప్రెస్టీజియస్‌గా డెవిల్ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాం. కొత్త సినిమాలను ప్రేక్షకులకు అందించాలనే తపన ఉన్న మా నందమూరి హీరో కళ్యాణ్ రామ్ మరో డిఫరెంట్ అవతార్‌లో ఆకట్టుకోబోతున్నారు. సినిమా అనుకున్న ప్లానింగ్ ప్రకారం జరుగుతుంది. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్‌ను చిత్రీకరిస్తున్నారు. 500 మంది ఫైటర్స్‌తో ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను వెంకట్‌గారు నేతృత్వంలో చిత్రీకరిస్తున్నారు. దీన్ని సిల్వర్ స్క్రీన్‌పై చూస్తే వావ్ అనేంత గొప్పగా పిక్చరైజేషన్ ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్‌ను తెలియజేస్తాం" అన్నారు. సౌందర్ రాజన్.ఎస్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని ... శ్రీకాంత్ విస్సా కథ,స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు.

నటీనటులు : నందమూరి కళ్యాణ్ రామ్

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950